Digitized in 2006
by
Thrinaina Informatics Ltd, Secunderabad, A.P., India.
(http://www.thrinaina.com)

From the original owned by
Sundarayya Vignana Kendram
and its partner Institutions

as part of the
British Library Endangered Archives Programme
supported by the
Lisbet Rausing Charitable Fund

Except for individual research purpose
any reproduction should be made with
written permission from the

Sundarayya Vignana Kendram,
1-8-1/B/25/A, Bagh Lingampally, Hyderabad - 500 044
Andhra Pradesh, India

COPYRIGHT STATEMENT

The copyright laws of the United States (Title 17, United States Code) and of India (Copyright Act of 1957) govern the making of photocopies or other reproductions of copyrighted material including foreign works under certain conditions. In addition, the United States extends protection to foreign works by means of various international conventions, bilateral agreements, and proclamations.

Under certain conditions specified in the laws, libraries and archives are authorized to furnish a photocopy or other reproduction. One of these specified conditions is that photocopy or reproduction is not to be used for any purpose other than private study, scholarship, or research. If a user makes a request for, or later uses, a photocopy or reproduction for purposes in excess of "fair use," that user may be liable for copyright infringement.

These institutions reserve the right to refuse to accept a copy order if, in their judgment, fulfillment of the order would involve violation of the copyright laws of the United States or India.

తుకారము చరిత్రము

చెన్నపురి, 1915

Record no. 270

Tukāramu caritramu

Cennapuri, 1915

Record no. 270

SUNDARAYYA VIGNANA KENDRAM
1-8-1/B/25/A, Bagh Lingampalli
Hyderabad – 500 044, Andhra Pradesh, India

Bibliographic Record Target

తుకారము చరిత్రము / తుకారమ్.- 2. ముద్రణము.- చెన్నపురి : సరస్వతీ నికేతనము, 1915.

(1), v, 115 p. ;17 cm.

Record no. 270

Tukāramu caritramu / Tukāram.- 2. mudraṇamu.- Cennapuri : Sarasvatī nikētanamu, 1915.

(1), v, 115 p. ;17 cm.

Record no. 270

35 mm microfilm
Image placement: IA (IIA) IB IIB Date filming began:

VISWANATHAN TEKUMALLA
FLAT 801, PRASANTH TOWERS
MUSHIRABAD MAIN ROAD
HYDERABAD-500048, AP

తుకారామ చరిత్రము

సరస్వతీ నికేతనము, వంగిపల్లెగ్రామము

(69)

T. Atchyutakrow
B.A.L.T
Sub asst Inspector
of Schools
Bander Range
Masulipatam

Masulipatam
5th Aug 1915

తుకారాము

ఓం

తుకారాము చరిత్రము

ద్వితీయ ముద్రణము

మచిలీపట్టణములోని
"సరస్వతీ నికేతనము" వారిచే
ప్రచురింపఁబడినది.

చెన్నపురి
ఆంధ్రపత్రికా ముద్రాలయంబున
ముద్రితము.
౧౯౧౫

కాపీరైటు రిజర్వ్డు

వెల రు. ౦-౬-౦.

Printed through the Publishing Agents,
H. V. Krishna & Co.,
Chintadripet, Madras.

విజ్ఞాపనము.

ఆంధ్రవాఙ్మయమునందు, మహాపురుషుల జీవన చారిత్రము లతిస్వల్పముగ నున్నవి. అందునను భక్త పుంగవుల సచ్చరిత్రము, లొకటిరెంటికంటె మిక్కుటముగ లేవని చెప్పినను జెప్పవచ్చును. కావున చేతనైనంతవఱకు, భక్తుల సచ్చరిత్రలనువ్రాసి యాంధ్రమాతకర్పింపవలయునను సంకల్పమున నేనీగ్రంథమును రచియించితిని. నాకీసంకల్పముసుప్రసాదించి, ఈచరిత్రను బూర్తిచేయించిన జీవనదాతయగు పరాత్పరుని పాదపద్మములకు నీగ్రంథమును సమర్పించుచున్నాను. శ్రీ యోగీంద్ర నాథ్ బోసు విరచితమగు తుకారాముని చరిత్రను ముఖ్యావలంబనముగ గైకొని నేనీగ్రంథమును వ్రాసితిని. భాషయందును, జ్ఞానమునందును, బాలప్రాయుడనగు నావ్రాతలయందనేకలోపములుండుననుట నిక్కువమని, ఆంధ్రమహాజనులకు విన్నవించుకొనుచు, నీగ్రంథమునందలి తప్పులను సవరించిన మిత్రులకును, పండితులకును, వందనము లాచరించుచున్నాను.

౧౯౧౩ ఫిబ్రవరి
మచిలీపట్టణము.

ఇట్లు
సుజనవిధేయుడు,
గ్రంథకర్త.

ఉపోద్ఘాతము

భారతవర్షము మహాపురుషులకు లీలా క్షేత్రము. ప్రతియుగమందును, భక్తులు, జ్ఞానులు, కవులు, రాజ్యతంత్రనిపుణులు, న్యాయసంస్థాపకులు, ధర్మోద్ధారకులు జనించి భారతవర్షమును బవిత్రవంతముగ నొనర్చియున్నారు. ఈమహాపురుషుల ముఖ వినిసృత వాక్యామృత ప్రవాహములు, కృష్ణ, గోదావరి, తుంగభద్ర, మొదలగు మహానదులవలె, భారతీయుల హృదయక్షేత్రముల యందుఁ బ్రవహింపుచు, అమృతఫలంబులను ఫలింపఁజేయుచున్నవి. ఋగ్వేదకాలము మొదలు, నేఁటివఱకును గల సంస్కృత వాఙ్మయమంతయు, ధర్మభావపూరితమై యుండుటయే గాక, ఆధునికసాహిత్యము లన్నియు, ధర్మభావోద్దీపకములై, జాతీయ సాహిత్యమునకుఁ గల్పతరువులై, యలరారుచున్నవి. హిందీభాషయందు తులసీదాసుని

యొక్కయు, వంగభాషయందు రామప్రసాదసేనుని యొక్కయు, అరవభాషయందు తిరువళ్లువర్ యొక్కయు, ఆంధ్రభాషయందు వేమనయోగి, బమ్మెరపోతనామాత్యుఁడు, త్యాగరాజ స్వాములయొక్కయు, భక్తిరసపూరితమగు, కవితతోఁగూడిన పద్యములును, కీర్తనలును, ఆయా జాతీయులందఱ కానందమును గలిగింపుచు, ప్రేమారాజ్యమున కాకర్షింపుచున్నవి. ఆయా దేశముల యందు జనించి, జాతీయతయం దిమిడి మందీభూతమైయున్న, భక్తితత్త్వము నుద్దీపింపఁ జేసిన మహాభక్తులు, తమ తమ యిష్టదేవతల నుద్దేశించి చేసిన స్తుతి ప్రార్థనలతోఁ గూడిన కవిత్వమును, నేఁడు లక్షల కొలఁది మానవులు పాడుచు హృదయతాపములఁ బాసి, శాంత, దాస్య, స్నేహ, వాత్సల్య, మధుర భావములంజొచ్చుచున్నారు.

పదునేడవశతాబ్దము, ప్రారంభమునందు తుకారాముఁడు జన్మించెను. ఈశతాబ్దమునందు, ఆర్యావర్తము మహావిప్లవమునకు లోనైయుండెను. తలిదండ్రులను జెఱసాలయందిడి, సోదరులలోఁ గొందఱినిఁ జంపించి, ఔరంగజేబు భారతవర్ష సామ్రాజ్య పీఠము నధిష్ఠించెను. ఈతఁడు ముప్పదికోట్ల హిందువులను,

మహామ్మదీయ మతావలంబకులనుగఁ జేయ నుంకింపుచు హిందూ జాతీయ తత్త్వమునం దిమిడి ప్రకోపింపుచున్న స్వామిభక్తినే సాధనముగఁ గైకొని, మహా ప్రయత్నమున నిమగ్నుఁడై యుండెను. ఈ మహా ప్రయత్నమును జూచినయెడల మానవజాతియందు హిందూ ధర్మముయొక్క ప్రత్యేక వ్యక్తిత్వము నశించుకాలము సమీపించిన దని తోఁచుటవింతకాదు.

కాని పరమేశ్వరుని విధానమును గణనచేయుట దుస్తరము గదా? మహామ్మదీయుల విపుల ప్రయత్న సంఘాతమువలన, భారతీయుల జాతీయశక్తి విజృంభించి, మహామ్మదీయ ధర్మవిప్లవము నడంచుటయే గాక, మహామ్మదీయరాజ్యవినాశనము తోఁడ నీవిజృంభణము పూర్తియయ్యెను.

ఈమహావిప్లవము నెదుర్కొని సనాతన హిందూ ధర్మమును బునర్జీవింపఁజేసి, మహామ్మదీయులను రాజ్యభ్రష్టులనుగ నొనర్చి, భారతవర్ష సామ్రాజ్య సింహాసన మాక్రమించి, మానవచరిత్రయం దత్యద్భుత ప్రదర్శనమును బ్రదర్శించినవారలు మహారాష్ట్రులు. భక్తి, జ్ఞాన, కర్మల సమ్మేళనశక్తియే, మహారాష్ట్రుల నపూర్వగౌరవాన్వితులుగ నొనర్చెను. దాదాపుగ పదునేడవ

శతాబ్దము మధ్యభాగమునందు మహాబలశౌర్యధుర్యుఁడగు శివాజియు, జ్ఞానసంపన్నుఁడగు రామదాసస్వామియు, భక్తాగ్రగణ్యుఁడగు తుకారాముఁడును, తమ తమ ధర్మములను నిర్వహింపు చుండిరి. సమగ్రభారతవర్షమునం దంతటను, నవశక్తిని వ్యాపింపఁజేయుటకు, భగవానుఁ డీమువ్వురను సృజియించెనని చెప్పినను జెప్పనొప్పు. వ్యక్తిగత జీవనమునకు వలెనే, జాతిగత జీవనమున కపుడపుడు సుయోగము సంభవింపుచుండును. అప్పుడు జాతియొక్క ప్రతివిషయమందును కల్యాణోన్నతి లక్షితంబగును. మహాబలుఁడగు ఛత్రపతి శివాజీ మహారాజుయొక్క మహారాష్ట్ర సైనికగణము దిఙ్మండలములు ప్రతిధ్వనించు నట్లు రణవిజయనినాదములు చేయు నప్పుడు, తుకారాముని విరచితములగు, అభంగములు లక్షలకొలఁది మహారాష్ట్రులను, దేశభక్తి పూరితులుగ నొనర్చుచుండెను.

శివాజీ బాహుబలమునను, బుద్ధికౌశలమునను, మహారాష్ట్రసామ్రాజ్యమును స్థాపించెనని కొందఱు చరిత్రకారులు వ్రాసినవ్రాఁతలు, భ్రమ ప్రమాదములకు లోనై యున్నవి. ఒక్కబాహుబలము మీఁదనే నిర్భరపడి, జాతీయజీవనమును బ్రతిష్ఠాపించుట, యసం

భవము. మహమ్మదీయులు కొన్ని వందల వత్సరముల లోపల, అట్లాంటిక్ మహాసముద్రము వఱకుఁగల, దేశమునందంతటను తమరాజ్యమును వ్యాపింపఁజేసిరి. కాని ఈ రాజ్యవ్యాపకమునకు బాహుబలమే కారణము గాదు. మత బలముననే బలవంతులై రాజ్యవిస్తారమును జేయఁగలిగిరి. ఇదేవిధముగ మహారాష్ట్రులు, ధర్మబలమున బలవంతులై, సనాతన హిందూ ధర్మము నుద్ధరించి, భారతవర్షమునందు నూతన శకమునకుఁ గర్తలైరి.

VISWANATHAN TEKUMALLA
FLAT 501, 'PRASANTH TOWERS'
MUSHIRABAD MAIN ROAD,
HYDERABAD-500048. (A.P.)

తుకారాము చరిత్రము

మొదటి ప్రకరణము

మహారాష్ట్ర సామ్రాజ్యలక్ష్మికి మందిరంబు నాఁ బరఁగిన, పూనాపట్టణమునకు వాయవ్య మూలయం దెనిమిది క్రోసుల దూరమందుండు, ఇంద్రాణీ నదీ తటమున "దేహూ" యను గ్రామము గలదు. ఆ గ్రామమునందు "మోరే" యను ఉపాధిగల ప్రాచీన మరాటీకుటుంబము నివసింపుచుండెను. వీరు శూద్రులు. వాణిజ్యమే వృత్తిగాఁగల నీవంశీకులు, ఆదేశములోని యుచ్చపదస్థులగు మరాటీవారితోఁడ సంబంధ బాంధవ్యములు గలిగి గణనకెక్కి యుండిరి. ఈమోరే వంశమునందు క్రీ ౧౬౦౭ - ౧౬౦౮ వ వత్సరముల మధ్య సహిష్ణుతాధురంధరుఁడును, స్వార్థత్యాగియు నిష్ఠాగరిష్ఠుఁడును, భక్తశిఖామణియు నగు తుకారాముఁడు జనించెను.

ఈ వంశీకుల హృదయ సీమలయందు, నాటుకొనిన భక్తిబీజము, మొలకెత్తి క్రమానుగతముగఁ దుకారాముని తలిదండ్రుల జీవితములందు వృద్ధినొంది, యీయన జీవనము నందు సంపూర్ణ ఫల ప్రదంబయ్యెను. పురుషానుక్రమముగ భక్తి వైరాగ్యముల కాకరమైన వంశములు, మిక్కిలి యరుదని చెప్పుట యతిశయోక్తి కాదు. కాని యీతని వంశమునందలి సప్తమ పూర్వపురుషుఁడగు విశ్వంభరుఁడు వ్యాపారము చేయుచుండెను. న్యాయముగ ధనమార్జింపుచు దొరకిన దానితోఁ దృప్తినొందుచు, భక్తులు, జ్ఞానులు, సన్న్యాసులు, మొదలగు సాధుపురుషుల కాహార పానీయము లిచ్చుచు, సన్మార్గమునఁ గాలము గడుపుచుండెను. ఈయన కాలనియమము లేక యెల్లప్పుడును హరినామ స్మరణ చేయుచుండెడి వాఁడు. పండరిపురనాథుఁడు వీరి కులదైవము. ఈయన ధనవ్యయమగునని కాని, దొంగల భయమనికాని, పథశ్రమయని కాని, తలంపక బహుదూరస్థితంబగు పండరిపురమునకు కాలినడక నేఁగి, ప్రతియేకాదశి నాఁడును విఠోబాదేవుని దర్శించి, పూజార్చనలనుజేసి వచ్చుచుండెను. ఈవిధముగ పదునాలుసారులు పండరీ పురనాథుని సేవించిన

పిమ్మట, నొకానొక దినమున, స్వప్నమునం దాయన ప్రత్యక్షమై చెప్పినవిధముగా, దేహూగ్రామ సమీప మందలి మామిడితోటలో, విఠోబా (విష్ణు) విగ్రహము దొరకెను. ఆ విగ్రహమునకు ఇంద్రాణీ నదీ తీరమున, దేవాలయమును గట్టించి అందు భక్తి పరవశుడై పూజార్చనలను జేయుచుండెను. విశ్వంభరుని భార్య యగు ఆమాబాయి భక్తిసేవా తత్పరయై యుండెను. ఆ దంపతుల జీవనమునందే భక్తిబీజము మొలకెత్తెను. వారికి తుకారాముడు సప్తమ పురుషుడు. ఈ భక్తావతంసుని తండ్రిపేరు బోల్హోబా. చాల దినములనుండి యీవంశమునందు వచ్చుచున్న సద్గుణము లీయన యందు సంపూర్ణముగ వికసించెను. భక్తిపరాయణుడును, సేవానిరతుడునగు "బోల్హోబా" నిరతాన్నదాతయై, సమస్తప్రాణులయందును, దయయు, శాంతమును గలిగి ప్రవర్తింపుచు, కోపతాపము లెఱుంగక, అనృతము వంకబోక, సన్మార్గపథమున నడుచుచుండెను. తుకారాముని తల్లి, కనకాబాయి. ఈమెపతి భక్తి పరాయణయు, సచ్చరిత్రయు, భక్తురాలునై యుండెను.

చాలకాలము వఱకీదంపతులకు సంతానము గలుగలేదు. కాని వీరు సంతానాభిలాషతో విఠోబా దేవుని సేవింపుచుండిరి. ఈవిధముగ గొంతకాలము జరిగిన పిమ్మట, వయసు చెల్లిన కనకాబాయికి పుత్రుం డుదయించెను. అతనికి "శాజీ" యని నామకరణ మొనర్చిరి. భక్తాగ్రేసరుడగు తుకారాముడీదంపతులకు ద్వితీయ పుత్రుడు. ఈతని గర్భమున ధరించినప్పుడు, కనకాబాయి, విరాగముతో నొంటరిగ దిరుగుచు, విరామములేక, విఠోబా నామస్మరణము సేయుచుండెనని వదంతి గలదు. గర్భిణియైయున్న స్త్రీయొక్క మానసికావస్థ, యామె భావిసంతానము యొక్క చరిత్రను సూచించుననియు, యీవదంతి యొక్క యభిప్రాయమని చెప్పనొప్పు. తుకారాముని తరువాత నింకొక కుమారుడును, కొమార్తయు జనించిరి. పుత్రికాపుత్రులును ధన ధాన్య సమృద్ధియుం గలిగి, యీదంపతులు సంసార ధర్మములందు చరితార్థులైరి. సిరిసంపదలు గలిగినప్పుడు, పరమేశ్వరుని మఱచుచుండువారిని, సాధారణముగ జూచుచుండుము. కాని యీదంపతులు సంసార సుఖములలో మునిగియుండియు, సంసార సుఖప్రదాతను, మఱచిన వారలు గారు. వీరి గృహ

మునం దనుదినమును హరిభజనయు, భగవత్ప్రసంగమును జరుగుచుండెను. ఇందువలన తుకారాముఁడు, భక్తులతోఁగూడి సంకీర్తన సల్పుచు, నృత్యముఁజేయుచుండుటవలన, బాల్యముననే యీయన హృదయక్షేత్రమునందు భక్తిబీజములు మొలకలెత్త నారంభించెను. యుక్తవయస్సురాఁగానే బోల్లోబా యాడంబరముగ పుత్రికాపుత్రులకు వివాహములొనర్చెను.

పెద్దకుమారునకు సంసార మప్పగించి, మిగత జీవిత కాలమును, శాంతముగఁ గడప వలయునని బోల్లోబా తలంచెను. కాని బాల్యమునుండియు సంసారసుఖములయం దనురాగములేని "శాజీ" సంసార నిర్వహణభార గ్రహణమున కంగీకరింపకుండుట వలన, సంసార నిర్వహణభారము మన కథానాయకుని స్కంధముపైఁ బడెను. తుకారాముఁడు బాలుఁడైనను పితృాజ్ఞోల్లంఘనము చేయఁజాలక, సంసార నిర్వహణ కార్యమునకుఁ బూనుకొనెను. అప్పటికి తుకారాముని వయస్సు పదుమూఁడు వత్సరములు. ఐనను, బహు సమర్థతతోఁడ సంసార కార్యములను నిర్వహింపుచు, కుల పరంపరాగత వ్యాపారమునం దీతఁడు విశేష ప్రతిష్ఠ నార్జించి గొప్పగొప్ప ధనికుల విశ్వాసమునకుఁ బాత్రుఁడై, ధనమును గణింపుచుండెను.

తుకారాముని ప్రథమభార్య పేరు రుక్మాబాయి. ఈమె కాశరోగగ్రస్తురాలగుట వలన, ద్వితీయ పత్నిని గ్రహింప వలసిన వాఁడయ్యె. ఈతని ద్వితీయ భార్య పేరు జిజీబాయి. ఈమె సంసారమునకు యజమానురాలై యుండెను. జిజీబాయి మూర్ఖురాలనియు, తిట్టుఁబోతనియు, * మహీపతి వ్రాసియున్నాఁడు. ఆసంగతి యెట్లున్నను, ఈమె పతిభక్తి పరాయణురాలని నుడువుట కణుమాత్రమైనను సందియములేదు. మఱియు నీమె సంసార భారమును వహించి, భర్త ధర్మోపార్జనకు సహాయురాలయ్యె నని, నిస్సంశయముగఁ జెప్పవచ్చును.

సంసార భారగ్రహణానంతరము, కొంతకాలము వఱకు, తుకారామున కేవిధమగు, కష్టములు లేకుండెను. కాని యీయన పదునేడవ వత్సరమునందు దలిదండ్రులు పరలోకమున కేఁగిరి. భగవద్భక్తియు, వైరాగ్య శీలతయు, వంశానుక్రమముగ వచ్చుచున్నను సంపదయుఁ దలిదండ్రుల యందలి ప్రేమయు, విషయ సుఖానురక్తియు, సంసార కార్యనిర్వహణ చింతయు,

* ఈయన మహారాష్ట్ర భాషయందు భక్తలీలామృత, భక్తవిజయమను గ్రంథములను వ్రాసియున్నాఁడు

నేకమై తుకారాముని యాధ్యాత్మికోన్నతి ప్రయత్నముకుఁ గాలము దొరక నీయకుండెను. భావికాలోన్నతికి విపత్తులు సోపాన ప్రాయములు గదా? సాధారణముగ దారిద్ర్యము, విపత్తులు, ఉన్నత భావముల నణఁచివేయుచుండును. కాని కొంతమంది పక్షమున నవి యమృతవృష్టియై సద్భావమను మొలకలను వృద్ధి చేయుచుండును. బాల్యమునుండియు మహదైశ్వర్యములలోఁ దులఁదూగు సంసారమునందు పెరిగిన తుకారామునకు కష్టములు దెలియునెట్లు? తలిదండ్రులు జీవించియున్నంత కాలము తుకారామునకు సంసార మానందసాగరమై యుండెను. కాని తలిదండ్రులు గతించఁగనే యాయన జ్ఞాననేత్రము లున్మీలితము లయ్యెను. సుచరిత్రుఁడును వినయశీలుఁడును, సంసార కార్యనిర్వహణ చతురుఁడు నగు, తుకారాముఁ డందఱికంటెను, తలిదండ్రుల ప్రేమ కెక్కుడు పాత్రుఁడై యుండుటవలన, దలిదండ్రుల మృత్యువాతని కతిదుఃఖకరమై యుండుట సహజము గదా? తుకారాముని జ్యేష్ఠసోదరుఁడగు "శాజీ" సంసారమునం దుదాసీనుఁడగుట వలన సంసార భారము తుకారాముని తలపైఁబడెను. ఇట్లు కొంతకాలము గడచియుఁ గడువకమునుపే జ్యేష్ఠసోదరుని భార్య మరణిం

చెను. వెంటనే యాతఁడు పంజరమునుండి విడివడిన పక్షివలె, విరాగియై తీర్థయాత్రల కేఁగెను. జ్యేష్ఠసోదరుఁ డేఁగునప్పటికి, తుకారాముని వయస్సు పదునెనిమిది వత్సరములు. ఇట్టి వయస్సునందు విషయ సుఖములయం దాసక్తిలేకుండుట యసాధారణము. కాని తలిదండ్రులు, భ్రాతృజాయయు, మరణించుటయగాక, జ్యేష్ఠసోదరుఁడు విరాగియై తీర్థయాత్రాపర్యటనుఁడగుటవలన, సంసారాసక్తుఁడగు తుకారామునిహృదయము క్రమక్రమముగ వైరాగ్యమార్గ మవలంబింపుచుండెను. లోభ జనకమును, విపత్సంకులమును నగు, సంసారము నందుండి నిష్కామ భావమున నీశ్వర సేవఁ జేయుట, సులభసాధ్యముగాదను తలంపుననే, అనేకమంది మహాపురుషులు, సంసారములను విడనాడి యేకాకులై ధర్మాచరణము నందుఁ బ్రవర్తులై, ఈప్సితార్థముల నందికొని, తిరిగి మానవ సంఘమును సంసారమునఁ బ్రవేశించి, జాతీయతత్త్వము నందలి భక్తిజ్ఞాన వైరాగ్యములను బ్రబోధింపఁ జేసి యున్నారు. దయామయుని చిర మధుర ప్రేమ రసమును జవిచూచిన వారికి, ధన కనక వస్తువాహనము లెట్లు రుచించును? అట్టి వారాత్మ విస్మృతులై, యీశ్వర చరణారవింద

మరంద పానమత్తులై, ప్రవర్తింతురనుటకు చరిత్రలు వేయినోళ్ళ నుద్ఘోషింపుచున్నవి. ఈశ్వరప్రేమయం దాత్మవిస్మృతి, యెల్లరకును లభ్యముగాదు. కాని రాజర్షియగు జనకుఁడు మొదలగు కొందఱు మాత్రమే, సంపదయందుండియు, భగవంతుని యం దాసక్తిగలిగి యుండిరని వినుచున్నాము. దాదాపుగా భక్తులందఱు కష్టములవలన వైరాగ్యమును, వైరాగ్యమువలన భక్తిని పొందియుండిరని వివిధగ్రంథముల యందు వర్ణింపఁబడి యున్నది. మానవజీవితమునందు, విపత్తులపరిహార్యములు. కష్టములు గలుగుటవలన నెల్లరకుఁ బ్రేమలాభము చేకూర దనుట నిక్కువము. సముద్రము నందు దుముకు వారిలో ననేకులకు నత్తగుల్లలును, ఒక రిద్దఱకు రత్నములును లభించు విధముననే, సంసార సాగరమునందుఁ బడిపోవు కోట్లకొలఁది మానవులలో, స్వల్పసంఖ్యాకులకు మాత్రమే భగవత్ప్రేమ లభ్య మగుచుండును. కాని సంపదలయందుఁ గాని, ఆపదలయందుఁ గాని, ఈశ్వరుని చూచుచుండుట కలవడిన వారెప్పుడును, ఈశ్వరుని ప్రేమనుండి వంచింపఁ బడరనుటకు పురాతనవాఙ్మయమే సాక్ష్యము. తలిదండ్రులు గతించుటయు, సోదరుఁడు దేశాంతర గతుఁడగుటయు, ధన

ముల్లుఁ బోవుటయు, మొదలగు కష్టముల వలన సంసార సుఖము లనిత్యము లని తోఁచినకొలఁదిని, తుకారాముని వైరాగ్య మావరింపుచుండెను. వైరాగ్యమాక్రమించిన కొలఁదిని, యీశ్వరప్రేమామృతమును పానముఁ జేయుచు మైమఱచు చుండెను.

లక్ష్మి చంచల స్వభావిని గాదు. ఆమె యభిమానిని. కావున తన సేవయందు మనోనిశ్చలత లేని తుకారాముని వదలుట కాయత్తపడుచుండెను. వర్తకము జరుగుచున్న యెడల, అప్పిచ్చుటయు, అప్పు దెచ్చుటయు సంభవింపు చుండును. కాని తుకారాముని వైరాగ్యమును జూచి, పూర్వమునందువలె వర్తకులతనితో వ్యాపారమును జేయుట మానుకొనిరి. ఈయనకు రావలసిన బాకీలు రాకుండెను. కాని యీయవలసిన బాకీల నిమ్మని ఋణదాతలు తొందర పెట్టుచుండిరి. శ్రద్ధలేని వ్యాపారమునకు నష్టమేగదా ఫలము! ఇందువలన తుకారాముఁడు చేసిన వర్తకమునం దెల్లను నష్టము వచ్చుచుండెను. ఆదాయము తఱుగుచున్నను, సంసార వ్యయము పూర్వమువలెనే యుండెను. ఇట్లు కొంత కాలము జరుగునప్పటికి ఋణములు మిక్కుటమాయెను. సంసారము నెప్పటిస్థితికిఁ దేవలయునని ప్రయత్నించెను.

కాని కృతకృత్యుఁడుకాఁ జాలఁడయ్యె. తదుపరి చిల్లర వస్తువు లమ్ముదుకాణమును బెట్టెను. "కాని దానియందు గూర్చుండి విరామములేక హరిభజనచేయుచు బేరగాండ్రు వచ్చినప్పుడు వీరిచ్చిన ధనమున కేవిధమగు లోపము లేక సరకు లీయవలయును. ఇందు పొరబాటు జరిగినయెడల దోషము సంభవించును. కావున బేరగాండ్రడిగినట్లు సరకులనిచ్చుట యుత్తమ మని తలఁచి, వారడిగినట్లు సరకుల నిచ్చు చుండువాఁడు" అని మహీపతి వ్రాయుచున్నాఁడు. ఇట్లు వ్యాపార మొనర్చు చుండుట వలన దినమున కొక వ్యవహారము నందుఁ బ్రవేశింప వలసి వచ్చెను. అందువలన తుకారాముని లోకులు చిత్తచాంచల్యునిగఁ దలంపుచు నిందించుటకు మొదలిడిరి.

"భగవానుని చరణ కమలముల యందుఁ దగుల్కొనియున్న మనస్సును ద్రిప్పుకొనుటకు నాకు వశము గాదు. కావున నాశరీరమును వర్తకమునం దర్పించిన యెడల కుటుంబ కష్టములు దూరమగును" అని తలఁచి తుకారాముఁడు హరినామ స్మరణ చేయుచు, నెద్దుల పైన ధాన్యపు గోతములనైచి, చుట్టుప్రక్కల గ్రామములకేఁగి, ధాన్యమును విక్రయింపు చుండెను. కాని

తుకారాముని వర్తకమార్గము వేఱైనప్పుడు లాభము వచ్చునెట్లు? చేసిన వర్తకమునం దెల్ల నష్టము సంభవించిన కొలఁదిని, యాయనకు విఠోబా చరణపద్మముల యం దనురాగము వృద్ధి యగుచుండెను. తుకారాముఁడు విఠోబానామమును వినఁగనే, యానంద పరవశుఁడై, చేతులఁ దట్టుచు, కీర్తనలను బాడుచు, మైమఱచి నృత్యము చేయుచు, కాలము గడుపుచుండెను. ఇట్లు కొంతకాలము గడచునప్పటికి మూలధన మంతయు వ్యయమయ్యెను. అప్పుదెచ్చి యాతఁడు వర్తకము చేయుటకు గడంగెను. కాని భావోన్మత్తుఁడగు తుకారాముఁడు, వ్యాపారములయం దాదాయ వ్యయములను గమనింపఁ జాలక, పెట్టుఁబడి ధనమంతయుఁ గోల్పోయి చిట్టచివఱకు గృహమునందుఁగల వెండి బంగారు నగల నన్నిఁటిని విక్రయించి, వర్తకమునందుఁ బెట్టెను. కాని కృతకృత్యుఁడు కాఁజాలఁడయ్యె. ధనమంతయుఁ గోల్పోవుటవలన, తుకారాముఁడు దివాలా తీసినాఁడను వార్త క్రమక్రమముగ నెల్లెడల నల్లుకొనెను. అప్పులవా రొకరొకరు వచ్చి యీయన గృహద్వారమున కడ్డము గూర్చుండి ధనము నిమ్మని పీడింపసాగిరి. వర్తకము చేయువారి పక్షమున దివాలా తీయుటకంటె నవమాన

కరమగు కార్యమింకొకటి లేదుగదా? తుకారాముఁడీయవమానమును భరింపఁజాలక "ఈశ్వరా? నేనీ సంసారమెట్లు నడుపుదును? నన్నీ విధముగ విపత్తునందేల పడవైచితివి?" అని యెలుగెత్తి యేడ్వసాగెను. ఈయన దురవస్థను జూచి కొందఱాత్మీయులు ధనసాహాయ్యమొసంగిరి. కొందఱప్పులవాండ్రకు పూచీపడిరి. ఇందువలన తుకారామునకుఁ జిక్కులు కొంతవఱకుఁ దీరెను. కాని హరినామ స్మరణవలన తుకారామునకీ దుర్గతి సంభవించినదని బంధుగులు, స్నేహితులు, నిశ్చయించుకొని, యీయన నీవిధముగఁ దూలనాడుటకుఁ బ్రారంభించిరి. "నీవు పరమార్థము నార్జింపనెంచి, దివారాత్రములు హరినామస్మరణఁ జేయుచుండుట వలన, నీకీ దురవస్థ సంభవించినది. కాఁబట్టి యిప్పుడైనను విఠోబా ధ్యానమును మానుము. విష్ణుభక్తుల సంసారము లున్నతికి రావని వినుచుందుము. దీనిని నీవు ప్రత్యక్షముగ ననుభవింపుచున్నావు. విషయాసక్తి లేనిచో సంసారోన్నతి యెట్లగును? ఈసంగతిని యోజింపక యెల్లప్పుడును, హరినామస్మరణను జేయుచుండిన యెడల నీకన్నమెక్కడ నుండి వచ్చును? నీకీమాట లసమ్మతములుగా వచ్చును. కాని మామాటలు విననియెడల నీకు సర్వనాశనము గలుఁగుననుట నిక్కువము."

విషయాసక్తులగు వారిపక్షమున, నిట్టి యుపదేశములు సత్యములే గదా? తుకారాముని యవస్థను జూచి బంధుగులు స్నేహితు లీవిధముగ నిందించుటయే గాక, భార్యయు పైవిధముగ బోధించుటవలన, తుకారాముఁ డస్థిరచిత్తుఁడై, తిరిగి వర్తకముచేయఁ బ్రారంభించెను.

ఈయనకు గోనెలు మోయు ఎద్దులు నాలుగు కలవు. ఆ ఎద్దులమీఁద సరకులను వేసికొని గ్రామముల వెంటఁదిరుగుచు, క్రయ విక్రయముల కుపక్రమించెను. దొంగల భయమువలన గుంపులు గుంపులుగఁ గూడి ప్రయాణము చేయుచుండు వర్తకులతోఁడ తుకారాముఁడు వెళ్లుచు, ఉచ్చైస్స్వనమున హరికీర్తనలఁ బాడుచు "హరి హరీ" యని కేకలువైచి మత్తుఁడగుచుండెను. భక్తి రసామృతమును బంచిపెట్టుట కంటె భక్తులకానంద జనకమగు కార్యమెద్దిగలదు? కాని భయావహులును, విషయాసక్తులు నగు, సహచర బృందమునకు హరిభజన కర్ణకఠోరమై వారు మత్తుఁడగు తుకారాముని మార్గమధ్యమున విడిచి పోవుచుండిరి. ఇందువలన నప్పుడప్పుడు తుకారాముఁ డేకాకియై వెళ్లవలసి వచ్చుచుండుటచేత ననేక కష్టములకు లోనగుచుండెను.

ఒకానొక దినమున నిర్జనమార్గము నందొంటరిగ హరి భజనఁ జేయుచుఁ బోవు చుండ, నొకవృషభము డస్సి పడిపోయెను. ఎద్దుమీఁది సరకుల గోతమును గూడ నొరుల సాహాయ్యము లేనిది దింపఁజాలక, హరి నామ స్మరణఁ జేయుచు, నలుదిక్కులు చూచు చుండు నంతలో, సూర్యాస్తమయ మయ్యెను. మేఘములు క్రమ క్రమముగ దట్టములగు చుండెను. తీవ్రశీతలవాయువు వర్షాగమనమును సూచింపు చుండెను. ఇట్టి సమయము నం దాకస్మికముగ నొకఁడా* మార్గమునవచ్చి గోనెను దించి యెద్దును లేవఁదీసి, తిరిగి యెద్దుపైన గోతమును నైచుటవలన తుకారాముఁడు గమ్యస్థానమును జేరఁ గలిగెను. ఈవిధముగ వ్యాపారము చేయ మొదలిడిన కొద్ది దినములకే, మూఁడెద్దులు మరణించుటవలన, విషణ్ణ

*విఠోబా దేవుఁడు పథికునివేషమును ధరించివచ్చి, భక్తునకు సాహాయ్యముఁజేసి వెళ్ళెనని, మహోత్పత్తియందు తుకారాము చరిత్రను వ్రాసిన మహీపతి వ్రాయుచున్నాఁడు. కాని మహాపురుషుల జీవనచరిత్రములయం దాశ్చర్య విషయములను జొప్పించుటయు సామాన్యవిషయముల నద్భుతముగ నిర్వచించుటయు, తఱచుగఁ జూచుచున్నాము. అదేవిధముగ ఈయనచరిత్రయం దనేకాశ్చర్య విషయములు గలవు.

చిత్తుఁడై స్వగృహమున కేఁగెను. తుకారాముని యశ్రద్ధ వలన నెద్దులు మూఁడు మరణించినవని స్నేహితులు, బంధుగులు, మొదలగువార లీతని నిందించుటకుఁ బ్రారంభించిరి. దారిద్ర్యము దాంపత్యప్రేమను భంగపఱచు ననుట సర్వసాధారణ విషయము. కావున దరిద్రపీడిత యగు జిజీబాయి సంసారమును బోషించుమార్గమును గానక, ఈయనను నిందించుటకుఁ బ్రారంభించుటచేత తుకారాముఁ డెక్కుడు మనోవ్యథను బొందుచుండెను.

రెండవ ప్రకరణము

ఆత్మను భగవంతుని పాదారవిందములకును, శరీరమును సంసారమునకును సమర్పించి తుకారాముఁడు తిరిగి మిరపకాయలవ్యాపారమును జేయుటకు, కొంకణదేశమున కేఁగి సముద్రతీరమందలి యొకానొక గ్రామములోని దేవాలయసమీపమున, మిరపకాయల దుకాణమును బెట్టెను. తుకారాముఁడు, మామూలు ప్రకారమే మిరపకాయల విక్రయమునకుఁ బ్రారంభించెను. క్రయదారు లిష్టమువచ్చినంత ధనమిచ్చి, యిష్టమువచ్చినన్ని మిరపకాయలను దీసికొని వెళ్లుచుండిరి. తుకారాము మాఱుమాటాడక హరినామ స్మరణఁ జేయుచుఁ జూచుచుండెను. ఈవిధముగ నొకటి రెండు దినములలో దుకాణములోని మిరపకాయ లన్నియు దాదాపుగఁ బూర్తియయ్యెను. ఇట్టిసమయమునం దొకానొకఁడు వచ్చి "నేను కడు బీదవాఁడను. ఈదినము బందుగులచే నాగృహము నిండియున్నది. మిగతవస్తువు లచ్చటచ్చట సమకూర్చుకొంటిని. కావున మీదగ్గఱ నిలువయున్న మిరప

కాయలను నాకు విక్రయింపుఁడు. త్వరలో మీఋణమును దీర్చుకొందును" అని ప్రార్థించెను. ఆనుడువు లాలించి తుకారాముఁడు మాఱు మాటాడక మిగిలియున్న మిరపకాయలనన్నిఁటిని దీసికొని వెళ్లుఁడని నుడువ వాఁడిట్లనియె. 'వీనిని దీసికొని వెళ్లుటకు నాయింట గోతము లేదు. కావున గోతము తోడ మిరపకాయల నిచ్చినచో క్రయధనము నిచ్చునప్పుడు గోతమును గూడ నిచ్చెదను' అనుమాటలను విని గోతముతోఁడ మిరపకాయలను నాతనికిచ్చెను. ఈ వ్యవహారమునందు లాభముమాట యటుండ పెట్టుఁబడిసొమ్మునందు మూఁడువంతులు నష్టమువచ్చెను. మిగిలిన స్వల్పధనముతో నీయన స్వగ్రామమునకువచ్చుచు, మార్గమధ్యమునం దొక వంచకునిచేఁ జిక్కెను. ఆవంచకుఁ డీయనకు గిల్టు నగలను జూపించి, బంగారు నగలని నమ్మునట్లుగ జెప్పి, వీని విక్రయమువలన విస్తారము లాభము రాఁగలదని నుడివెను. సరళ స్వభావుఁ డగు తుకారాముఁ డా వాక్యములనమ్మి, యానగలను గొనుటకు జాలినంత ధనము తనయొద్ద లేదని నుడువ, వంచకుఁ డిట్లనియె "నీవు సత్యవాదివలెఁ గన్పట్టుచున్నావు. ఇందువలన నీపైన నాకు విశ్వాసము గలిగినది. కావున నీచేతనున్న ధన

మును మాత్ర మిచ్చి బాకీపడిన ధనమును వీలును బట్టి తీర్చుకొమ్ము" ఆమాటలను విని తుకారాముఁడు చేత నున్న ధనమంతయు నొసంగి గిట్టుబనగలను గైకొనెను. ఈవ్యవహారములకు బంధుమిత్రులవలన తుకారా మెట్టి తిరస్కారములను బొందియుండునో వేఱుగ వ్రాయ ననవసరము. జిజీబాయి ధనికుని కొమార్తె. అందువలన నీమెపైని వర్తకుల కొకింత విశ్వాసముండెను. కావున నామె యొకానొక ధనికునియొద్ద కేఁగి రెండువందల రూప్యములు ఋణముదీసికొనివచ్చి భర్త కిచ్చి వర్తకముచేయుఁ డని ప్రోత్సాహపఱచెను. వణిగ్వంశమునందు జన్మించుటవలన వర్తకముదప్ప వేఱు మార్గము లేదుగదా? ఈసమయమునం దాగ్రామములోని వర్తకులు "వాలేఘాట్టు" అను స్థలమునకు వర్తకమున కేఁగుచుండిరి. తుకారాము వీరితో నేఁగి క్రయవిక్రయముల కుపక్రమించిన కొలఁదిదినములలోనే తోడి వర్తకుల సాహాయ్యము వలన, వర్తకమునం దేఁబది రూప్యములు లాభమువచ్చెను. కాని వర్తకులతోడ తుకారాముఁడు గృహాభిముఖుఁడగు సమయము నందు, ఋణగ్రస్తుఁడైన యొక బ్రాహ్మణుని రాజభటులు వెంబడించి వెళ్లుచుండిరి. చిక్కి జీర్ణవస్త్రమునుధరించి మెడకుఁ

జుట్టుకొనియున్న ఇనుపశృంఖలముల బరువునుమోయఁజాలక, వంగి వంగి నడుచుచున్న యాబ్రాహ్మణుఁడు చూపఱులకు జాలి గొలుపుచుండెను. సాధ్వీతిలకమని చెప్పనొప్పు బ్రాహ్మణి యాయన వెనువెంట నడుచుచు, ప్రాణనాథుని దురవస్థకుఁ బరితపించుచుండెను. ఆబ్రాహ్మణుఁ డీవిధముగఁ బండ్రెండు వత్సరములనుండి పర్యటనముఁ జేయుచు, యాచనవలన లభించిన ధనమును రాజభటుల కిచ్చుచుండెను. కాని ఋణవిముక్తుఁడు గాఁజాలఁడయ్యె. ఆబ్రాహ్మణున కీయన తోడి వర్తకులొకటి రెండణాల చొప్పున దానముచేసిరి. కాని ప్రేమపూరితహృదయుఁడగు తుకారాముఁడు బ్రాహ్మణుఁ డీయవలసిన ఋణశేషము నంతయు రాజభటుల కొసంగి, బ్రాహ్మణుని ఋణ విముక్తునిగ నొనర్చెను. తదుపరి యాదంపతులకు నూతనవస్త్రముల నిచ్చి మృష్టాన్నభోజనముఁ బెట్టించి, పరమానందభరితుఁడై మిగిలియున్న ధనమును దక్షిణగ నర్పించెను. పండ్రెండు వత్సరములనుండి క్రూరదండన ననుభవించుచున్న బ్రాహ్మణుఁడు, తుకారాముని కరుణ వలన ఋణ విముక్తుఁడై, శాంతిలాభము నొందెను. భక్తావతంసుఁడగు తుకారాముఁడు, తనధనమునంతయు

బ్రాహ్మణునకు సమర్పించి, ధనబంధములనుండి విముక్తుఁడాయెను.

తుకారాముఁడు స్వగృహమును బ్రవేశింపక పూర్వమే, తోడివర్తకుల వలన జరిగిన వ్యవహారమంతయు భార్యయు, మిత్రులును విని ఆయనకు పిచ్చియెత్తినదని సిద్ధాంతీకరించిరి. దరిద్రముచేఁ బీడింపఁబడుచున్న జిజీబాయి కోపానలమునకు మేర లేదయ్యె. ఇందువలన తుకారాము గృహమున నివసించుటకే దుస్తరము కాఁజొచ్చెను. ఇట్లు కొంతకాలము జరుగునప్పటికి వర్షాభావమువలన మహారాష్ట్రదేశము క్షామదేవత పాలఁబడియె. రూప్యమునకు రెండుసేర్ల బియ్యమైనను దొరికకుండెను. తుకారాముని కుటుంబమువారు మలమల మాడఁజొచ్చిరి. కుటుంబ దురవస్థను జూచి సహింపఁజాలక తుకారాముఁడిరుగు పొరుగు వారిని సాహాయ్యము చేయుఁడని కోరెను. కాని చేయువారెవ్వరు? మీఁదు మిక్కిలి కొందఱు "విఠోబా నడుగుము. ధాన్యమిచ్చును" అని హేళనచేయ సాగిరి. కాని భక్తులు దూషణ భూషణలకు లొంగరు గదా? క్షామమింకను ఘోరమగుచుండెను. ప్రజలు గృహములను వదలి, చెట్లుగుట్టలు పట్టి యాకలములను

దిని కాలము గడుపుటకుపక్రమించిరి. ఈ సమయము నందు బహుదినములుగ, కాసరోగ గ్రస్తురాలగు తుకారాముని ప్రథమ భార్య మరణించెను. ఈకారణమాధారముగఁ గైకొని, లోకులీతనిని వేయిముఖముల నిందింపసాగిరి. క్షామదేవతకు వేలకొలఁది మానవులు బలి యగుచున్నను, సంపదతోఁ దులదూగుచుండిన నీసంసారము తుకారాముని హరిభక్తివలన దరిద్రవంతమై, తినుట కన్నములేక, భార్య గతించెనని నిందింపుచుండిరి. ఇట్టి దుఃఖ సమయమునందు, బంధువుల తిరస్కారము నీయన హృదయమునకు శూలములై నాటుకొనుచుండెను. ధన కనకవస్తు వాహనములన్నియుఁ బోయెనని కాని, లోకులు తన్ను నిందింపుచున్నారని కాని, తుకారాముఁడు కష్టము ననుభవించినవాఁడు గాఁడు. విఠోబా దేవుని నిందించుటయే, యీయన పరితాపమునకుఁ గారణము. అప్పుడప్పుడు విఠోబా దేవుని నిందించు వాక్యములను విని సహింపఁజాలక "విఠోబాదేవుని నామ మెన్నఁడు నుచ్చరింపని వారల భార్యా పుత్రాదులు గతించుటకును, దరిద్రులగుటకును కారణమే" మని ప్రశ్నింపుచు, పరమేశ్వరుని నిందించుట, అజ్ఞానఫలమని బోధించి, మైమఱచి నృత్యము

చేయుచుండెడివాఁడు. భక్తిరసామృత సింధువునం దోలలాడు వారల జన్మమే గదా ధన్యము!

భార్య గతించిన కొన్ని దినములకే, ఈయన ప్రథమ పుత్రుఁడు పరలోక యాత్ర కేఁగెను. ఇందువలన తుకారాముఁడు దారుణవేదన ననుభవించెను. కాని యీశ్వర విధానమును గ్రహించుట దుస్తరముగదా? ఈశ్వరుఁడు భక్తుల ఘోర పరీక్షల యందేల పరీక్షింపుచుండునో నుడువఁజాలము. కాని మానవజీవితమునందు, కష్టము లపరిహార్యములు. పుటములు పెట్టిన కొలఁదిని బంగారు మేలిమి యగువిధముననే, కష్టములు సంభవించిన కొలఁదిని భక్తులు పవిత్రులగుచుందురు. బాల్యము నుండియు, భక్తిపరవశుఁడై యున్న తుకారాముని హృదయమింకను బక్వముకాలేదు. సంసార సుఖములపై నాసను పూర్తిగ విడనాడఁడయ్యె. కాని కష్టముల మీఁదఁ గష్టములు సంభవించుచుండుటవలన సంసార మనిత్యమనియు, సుఖదుఃఖములు క్షణభంగురములనియుఁ దలంచుచుండెను. ఇట్లు దలంచిన కొలఁదిని వైరాగ్యము వృద్ధి గాఁజొచ్చెను. వైరాగ్యాభివృద్ధితోఁడ అహేతుకీభక్తి యలవడుచుండెను. ఈయన హృదయాకాశమునం దవిద్యావ్యాపకమగు రాత్రి గడు

వఁగనే, ప్రజ్ఞానమయ సూర్యోదయం బయ్యెను. అంత జ్ఞాన ప్రపంచము దృగ్గోచరం బాయెను. హలాగ్రమున భేదింపఁబడక భూమి పండనటులనే ఆత్మాభిమానము, విషయలాలసలతోఁడఁ బరిపూర్ణమగు కఠోర మానవ హృదయము దుఃఖముల వలన పరితపింపఁ బడనియెడల ఈశ్వరప్రేమను గ్రహింపఁజాలదు. మహీపతి యీసందర్భమునం దీవిధముగ వ్రాయుచున్నాఁడు. "కృషీవలుఁడు గ్రీష్మకాలపు ప్రచండోత్తాపమునం దుత్తప్తుఁడై, సంతత వర్షధారల నోలలాడి, ఫలరూపమగు నానందమును బొందునటులు, భక్తుఁడు గణనాతీత క్లేశముల కోర్చి బహు పరీక్షల నతిక్రమించి, భగవద్దర్శన ఫలమును ననుపమానమగు నానందమును బొంది, దుఃఖ విస్మృతుఁడగును." భార్యాపుత్రులు గతించుట వలన తుకారాముని జుట్టియున్న మోహపాశములు తుత్తునియలు గాఁజొచ్చెను. తానీ సంసార మోహాంధకారమునఁ దంధప్రాయుఁడై తిరుగుచుండుటకుఁ బరితాపమును బొందుచుండెను. ఆ సమయమునందాయన మానసికావస్థను గూర్చి మహీపతి ఇట్లు వ్రాయుచున్నాఁడు. "సంసారోన్నతి కొఱకు కెన్నియో పాట్లు పడితిని. కాని యందువలనఁ జేకూరిన లాభమెద్ది?

దుస్సహ దుఃఖమేగదా? సంసారమున దుఃఖములు పర్వతప్రమాణములు. సుఖములు, స్వప్నజనితభ్రాంతి తుల్యములు. నా యాయుఃపరిమితి బహుస్వల్పము. ఇందుఁ జాలభాగము సంసార సేవయందే గడచెను. కాని యీ శేషజీవితమును రుక్మిణీ మనోనాథుని సేవయందు గడుపుదును."

తుకారాముఁ డీవిధముగఁ దలపోయుచు, జీవిత లక్ష్యమును స్థిరపఱచుకొని, హృదయశాంతి నొందెను. పుత్రికా పుత్రులను వీడి, "ప్రాణనాథునితోఁడ ననంత ప్రేమ సాగరమునం దోలలాడుటకు మృతభర్తశరీరమును వడియం దిడికొని, ఘోరాగ్నిజ్వాలల మధ్య భస్మీపటలమగు సతి వలె, తుకారాముఁడు ప్రాణవల్లభుని చరణారవింద సేవా పరాయణచిత్తముతోఁడ, సంసారబంధనములం ద్రెంచుకొని, దేహూగ్రామమున కనతి దూరమందున్న, భాస్వానాథ పర్వతారణ్యమును జొచ్చి, కఠోర తపస్సున కుపక్రమించెను.

మూఁడవ ప్రకరణము

నిర్జన ప్రకృతికిని, సాధకుని హృదయమునకుఁ గల సంబంధ మతిమధురము. సంసార కోలాహలములు హృదయ శాంతికి భంగకరములనియెంచి, ప్రకృతి యొక్క నిస్తబ్ధాంకమునందు శాంతిలాభమును బొందుటకుఁ బ్రయత్నించు సాధకుఁడు దృష్టిని నిరోధించి, జ్ఞాననేత్రముల ద్వారమున ప్రాణనాథుని సందర్శించి, పరితృప్తినొందు చుండును. తుకారాముఁడు భాస్వానాథ పర్వతమున కేఁగి, స్వీయారాధ్య దేవుఁడగు విఠోబా దేవుని ధ్యానమునందు ప్రవృత్తుఁడయ్యెను. అనేక దినములనుండి, ఎవరిని వ్యాకుల హృదయమున నన్వేషింపుచుండెనో, ఆయనను నేఁడు హృదయ సింహాసనమునం దావిర్భావముఁ జేసికొని, ఆత్మోపలబ్ధినొంది కృతార్థుఁడాయెను. వైష్ణవభక్తు లీశ్వరుని ప్రేమాస్పదునిగను, జీవాత్మను ప్రేమించు దానినిగను వర్ణించి యున్నారు. ప్రేమాస్పదుఁడగు భగవానుని దర్శనము, స్పర్శనము, చింతనముల వలన గలుగు సుఖము,

శాస్వతానంద జనకము. ప్రేమాస్పదుని దర్శన మబ్బని యెడల ప్రేమించుదాని హృదయ మధీరమగును. ప్రేమాస్పదుని సాక్షాద్దర్శనము వలన ప్రేమించుదాని హృదయ మమృత సిక్తమగును. ప్రేమార్థికి శాశ్వత సౌఖ్య దాయకముగదా? నూతనానురాగావస్థ యందుఁ బ్రేమించుదానియొక్క ఆతురతతోఁ గూడిన సుఖముతోఁ బోల్పఁదగిన సుఖ మితరసమయములయం దనుభవమునకు రాదనుట నిక్కువము. తుకారాముఁడు నవానురాగజనితసుఖనిమగ్నుఁడై, సంపూర్ణముగ నాత్మవిస్మృతి నొంది, కాలభేదము లేక ప్రాణవల్లభుని సహవాస సుఖమున కాలము గడుపుచుండెను. ఈతఁడెచ్చటకేఁగినదియుఁ దెలియక, ఆత్మీయులు వెదుక నారంభించిరి. తిరిగి తిరిగి కనిష్ఠసోదరుఁడు డంబానాథ పర్వతోపరిభాగమున తుకారాముని గలిసికొనెను. సోదరుని యనురోధము వలన తుకారాముఁడు, పర్వతమును విడిచి, ఇంద్రాణీ నదీతీరమునకు వచ్చెను. ఏడుపవాసములు గడచిన పిమ్మట స్వగృహమునందీయన భుజించెను. సోదరుఁడు సంసారికావస్థను బోధింపఁదొడంగెను. ఈయన చేసిన వర్తకమువలన ధన కనక వస్తువాహనము లన్నియుఁబోయినను, తండ్రిగారిచ్చిన అప్పులపత్రములు

మాత్రము కొన్ని మిగిలి యుండెను. తుకారాముఁడు విషయ కార్యములయం దుదాసీనుఁడగుట వలన బాకీలు రాఁబట్టుకొనుట కణు మాత్రమైనను బ్రయత్నింపక, ఒకానొక దినమునం దింద్రాణీ నదీ ప్రవాహమునందా బాకీలపత్రములను బాఱవేయఁ బ్రయత్నించి, తమ్ముని మనోభావమును గ్రహించి సగము పత్రములను తమ్మున కిచ్చి మిగిలినవానిని, నదీజలమునఁ బడవైచి "శీతాతపములకీ గొంగడియు, భిక్షాన్నమునకీ మృణ్మయ పాత్రయు, నాధారమగుఁగాక" అని నుడువుచు తమ్మునకు సెలవిచ్చెను. తదుపరి తుకారాముఁడాత్మశుద్ధి కొఱకుఁ బ్రాతఃస్నానమును, దేవమందిరములను శుభ్రపఱచుటయు, పుణ్యకాలములయం దుపవసించుటయు, మొదలగు కార్యములను జేయుచు, ధ్యాన ధారణ సమాధుల యందుఁ బ్రవృత్తుఁడై, ఇంద్రియ దమనార్థము దినముల వరుసను, ఆహారమును దగ్గింపుచు, నిద్రను నియమ బద్ధముగ నొనర్చుకొనెను. దేహూ గ్రామమునకు రెండు క్రోసుల దూరమునందు "భాండూర్" అను పేరుగల సుందరపర్వత మొందు గలదు. తుకారాముఁడు దినమంతయు నాసుందరపర్వతముపైఁ దిరుగుచు రాత్రి దేహూ గ్రామమున వచ్చి భక్తులతోఁ జేరి సంకీర్తన సల్పుచుం

డెను. తుకారాముని జూచి, వర్తకమునందు నష్టము వచ్చుటవలన పిచ్చియెత్తినదనియు, మహాభక్తుఁడగుట వలననే ఇంద్రాణి జలములయందు మిగిలిన సర్వస్వము నర్పించెననియుఁ బొట్టకూటికి భక్తుని వేషమును ధరించినాఁడనియుఁ బలువురు పలువిధములఁ బల్కఁదొడంగిరి. గమ్యస్థానము దృష్టిపథముననుండి, దృఢ విశ్వాసమున నిర్గమించు వానికి, నిందాస్తుతులు బంధనములు కాఁజాలవుగదా? ఇంద్రాణీనదీ తట తరుచ్ఛాయలలోను, భాండార పర్వతకందరముల యందును, ఏకాకిగ సంచరింపుచుండు తుకారాముని యొక్క భక్తివిశ్వాసములు, ప్రకృతిసాహాయ్యము వలన, దిన దినాభివృద్ధి నొందుచుండెను. ఈతఁడింద్రాణీనదీ కలకల శబ్దముల యందును, విహంగ గణముల మృదుమధుర రుతముల యందును, గిరిగహ్వర ప్రతిధ్వనుల యందును, ప్రియతముని కంఠధ్వనిని వినుచుండెను. బహుదూరమునకు వ్యాపించిన స్నిగ్ధ శ్యామ శోభల యందును, పుష్పగుచ్ఛముల సౌందర్యఘటనావిధానము నందును, శ్యామసుందర మూర్తి సౌందర్యమునే జూచుచుండెను. సుస్నిగ్ధశీతల సమీరతరంగముల స్పర్శవలన, నాచిరశీతలుని స్పర్శానుభవమును బొందుచు పులకాంకురితుఁడై, మధుపాన

మత్త మధుపము సేయు మధుర ఝంకారము ననుకరించి మనోవల్లభుని కీర్తిని గీర్తింపుచుండెను. ప్రకృతి యొక్క సౌందర్యసాగరవీచికా మర్మర స్వనంబులతో శ్రుతిఁగలిపి విరహగీతములఁ బాడుచుండెను.

ఈయన భజనఁ జేసికొనుచు దిరుగుచుండు స్థలమునానుకొని, యొకానొక కాఁపు వానిపంటపొలముండెను. ఆభూస్వామి తుకారామున కిట్లనియె "నీవెప్పుడిచ్చటనే తిరుగుచుందువు. కావున నీపొలములోని సస్యమును రక్షింపుము. ఇందు వలన మనకిరువురకు నుపకారము గలుగును. ఈ క్షేత్రమునందు ఫలించిన ధాన్యములో నాల్గవవంతు నీకిచ్చెదను." అను నుడువులాలించి కృషికున కుపకారము గలుగు నను తలంపున, వానిమాటల కంగీకరించెను. ఆభూస్వామి క్షేత్రమధ్యము నందుండు మంచెపై తుకారాముని కూర్చుండఁబెట్టి పిట్టలు భయపడుటకుఁ బెద్ద కఱ్ఱను జేతికిచ్చెను. భావోన్మత్తుఁడగు తుకారాముఁడు కంకులమీఁద వ్రాలి గింజలనుభక్షించు పక్షులను జూచి "క్షుధాతురములగు నీపక్షుల నెట్లు వెడలఁగొట్టుదును? మహాక్షామ మగుట వలన వీనికిఁ దగినంత యాహారము లభించుట లేదు. పరమేశ్వరుని కృపవలనఁ ద్వరలో వర్షము గురియుఁ

గాక! కడుపు నిండి భుజించి పక్షులానందమున సంచరించుఁగాత" అని తలంచుచు పగలు రెండు జాములగు నంతటనే పక్షులవంకఁదిరిగి నది కేఁగి నీరుద్రావిరండని కేకలువైచుచు, లేవఁగొట్టి "సంధ్యా సమయమున చీకటి పడుచున్నది. మార్గము తప్పిపోవుదురు. కనుక మీమీ నిలయములకే కను వెలుతురున నేయఁగి సూర్యోదయమైనంతటనే తిరిగి రం"డని చెప్పుచు పక్షులఁ దరుముచుండెను. మఱియును, ఈ పక్షులు కావలసినంత వఱకు భుజించుచున్నవిగాని, మఱుదినమున కణుమాత్రమైనను దాచుకొనుటలేదుగదా యని తలంచి, నాయవస్థ యెప్పుడీవిధముగ నగునని, తుకారాముఁడు భగవానుని ప్రేమపై నిర్భరపడి, మఱుదినపు చింతనుండి విముక్తుఁడగుటకుఁ బ్రయత్నింపుచుండెను. రాతిప్రతిమవలె మంచెపైన నిశ్చేష్టిత భావమున నుండు తుకారాముని జూచి, పక్షులు లేశమైనను భయపడక, తండోపతండముగ వచ్చి, కంకులను భక్షించి యేఁగుచుండుటవలన స్వల్ప దినములలో నా క్షేత్రమునందలి పంటలోఁ జాలభాగము పూజ్యమాయెను. క్షుద్బాధా పీడితులగు వేలకొలఁది మానవుల కన్నమిడి సంతసించు మహాదాతవలె, పక్షులు భుజంచుటను జూచి తుకారాముఁ డానందమును బొందు

చుండెను. "ఆత్మవత్ సర్వ భూతాని" అను న్యాయము, ఉక్తుల యందును, జ్ఞానమునందును గాక, ఆచరణ యందుఁబెట్టి ఆత్మానందమును బొందువారలే ధన్యులు! భూస్వామి తన క్షేత్రమును జూచి కుపితుఁడై తగు మనుష్యులతోఁ జెప్పి మధ్యస్థము చేయుఁడని కోరెను. మధ్యవర్తులు ప్రశ్నింప తుకారాముఁ డిట్లనియె. "ఈసమస్త జీవములు క్షుధానుసారముగ భుజించి తృప్తిఁజెందుచున్నవి. కాని మఱుదినమును గూర్చి చింతించుటలేదు. కావున నీకఱవు కాలమునం దీపక్షులను రక్షించుటయే నాప్రథమ కర్తవ్యము" అను మాటలను విని, భూస్వామి నిందించుటకుఁ బ్రారంభించెను. తామంచ వేసిన ధాన్యమునందు తఱిగిపోయిన ధాన్యమును భూస్వామికి తుకారాముఁడీయ వలయునని మధ్యవర్తులు తీర్మానించిరి. కాని భూమిలోని సస్యమును గోసి నూర్చఁగా, భగవానుని కృపవలనఁ బండవలసిన దానికంటె రెండు రెట్లు మిక్కుటముగఁ బండెనని మహీపతి వ్రాయుచున్నాఁడు. ఈవిషయమున మతభేదము లుండవచ్చును. కాని స్వంత భూమియైనను తుకారాముఁడీ విధముగనే చేయువాఁడని చెప్పుటకు సందియము లేదు. మఱియు, నీ సందర్భమునం దీయన సరళత్వమును, జీవదయా పరత్వమును, ప్రశంసింపక మూకీభావమును వహింపఁజాలము గదా?

ఈయన పూర్వపురుషుఁడగు విశ్వంభరుఁడు దేహూ గ్రామమునందుఁ గట్టించిన విఠోబాదేవుని మందిరము శిథిల మగుచుండుటవలన దానిని బాగు చేయుట కీయన పూనుకొనెను. కాని ధన మెచ్చట? స్వహస్తముల తోఁడ మందిరమును బాగుచేయ నెంచి మట్టి తోఁడ ప్రహరీ గోడను బెట్టుట కుపక్రమించెను. సదిచ్ఛతోఁ గూడిన కార్యమెప్పుడును భగవానుని కృప వలనఁ బూర్తియైతీరును. కాఁబట్టి యీయన ప్రయత్నమునకు సాహాయ్యము తనంతటఁదానుగ వచ్చుటవలన, స్వల్పదినములలోనే దేవాలయమును బాగుచేయించి అన్నదానమును జేయించెను.

ప్రతిదినమును భక్తులు నవ్యగీతములతోఁడ విఠోబాదేవుని స్తుతించుటనుజూచి, గీతగుచ్ఛముల రచియించి, విఠోబాదేవుని పాదయుగళమునం దర్పించుట కొఱకు, తుకారాముఁ డువ్విళ్లూరుచుండెను. ఇందువలన పూర్వకవి విరచితములగు భక్తిగ్రంథములను దదేకనిష్ఠతోఁ జదువుటకుఁ బ్రారంభించి * నామదేవుని యభంగములను బఠించి భక్తితత్త్వము నాస్వాదింపసాగెను. తదుపరి కబీరుకీర్తనలు * జ్ఞానేశ్వర కృతమగు గీతా వ్యాఖ్యానమును, అమృతానుభవమను గ్రంథమును, † ఏకనాథస్వామి విరచిత భావార్థరామాయణమును, శ్రీమద్భాగవత వ్యాఖ్యానమును, యోగవాసిష్ఠ రామాయణము మొదలగు గ్రంథములను జదివిసకొలఁదిని భక్తియొక్క నిగూఢతత్త్వమును దెలిసి కొనియెను. ఈ గ్రంథములలోని గభీర తత్త్వములను మననముచేయుటకు భాండారపర్వత కందరముల నాశ్రయించి యేకాకిగఁ దిరుగు

* నామదేవుఁడు పదుమూఁడవ శతాబ్దశేష భాగమునం దుండెను. మహారాష్ట్రదేశమునందు ప్రప్రథమమున భక్తిబీజము నాటిన దీ మహాపురుషుఁడే. ఇందువలన మహీపతి మొదలగు భక్తచరిత్రాఖ్యాయికాకారులు, నామదేవుని యుద్ధవుని యవతారమని వర్ణించి యున్నారు. ఈయన రచియించిన గ్రంథమేదియుఁ గానరాదు. కాని అభంగము లిప్పటికిని బాడుచుందురు. అనేకులు నామదేవుని యవతారమే తుకారాముఁడన్ని విశ్వసించుచున్నారు.

* జ్ఞానేశ్వరుఁడు నామదేవుని సమకాలికుఁడు. ఈయన జ్ఞానమార్గమునఁ బ్రసిద్ధి కెక్కియుండెను. ఈయన రచియించిన గీతావ్యాఖ్యాన మతి విస్తీర్ణమై పాండిత్య ప్రభావమును వెల్లడించుచుండును. మహారాష్ట్రదేశమునం దీ వ్యాఖ్యానమును 'జ్ఞానేశ్వరీ' యను పేరునఁ బిలచుచుందురు. భాగవతము మొదలగు గ్రంథములతోఁ బాటు దీనికి గౌరవమును జూపుచుందురు.

† ఏకనాథస్వామి పదునాఱవ శతాబ్దాంతమునందు జన్మించెను. ఈయన తుకారామునివలె, భగవద్భక్తియు జీవదయాపరత్వముఁ గల మహాపురుషుఁడు.

చుండెను. స్వభావసిద్ధముగ జ్ఞాపకశక్తి యత్యద్భుతముగాఁగల తుకారాముఁడితరచింతలు లేక సర్వదా భక్తితత్త్వమును మననము చేయుచుండుటవలన, నచిరకాలములోనే, భక్తిశాస్త్రము నందు పారదర్శికుఁడగుటయేఁగాక, ఏయే మహాపురుషుల గ్రంథము లీయన పఠించెనో, ఆయా మహానుభావుల చరిత్రములలోని సద్గుణములు, గంభీరభావములు, ఈయన హృదయమునందు ముద్రితములయ్యెను. పిమ్మట నీయన కవిత్వమును జెప్పుటకు మొదలిడెను. ఈకవిత్వవికాసమే తుకారాముని నవజీవనమునకు మూలాధారము. ఇంతటి నుండియు "శేట్" తుకారాముఁడు "భక్త" తుకారాముఁడయ్యెను.

నాలుగవ ప్రకరణము

జీవదయాపరత్వమును, భగవంతునియం దనురాగమును, భక్తియొక్క ప్రధాన లక్షణములు. మహాపురుషుల జీవితములం దీలక్షణములు ప్రకాశింపుచుండును. భగవానుని యందనురాగము గలవారు పశు పక్షి తరు లతాదులను భగవంతుని చిహ్నములుగ భావించి ప్రేమింపుచుందురు. ప్రాణనాథుఁడు వ్రాసిన యుత్తరమును ప్రాణపదముగ దాచుకొను భార్యవలె, విశ్వేశ్వరుని యందనురాగముగల భక్తులు, విశ్వపదార్థముల నన్నిఁటిని, ప్రియతమములుగఁ జూచుచుందురు.

తుకారాముఁడు విశ్వసేవా వ్రతమునకుఁ బూనుకొనెను. సంకీర్తన జరుగుస్థలములలో భక్తులకాళ్లకు రాళ్లు ముండ్లు మొదలగునవి గ్రుచ్చుకొను నను తలంపున, ఆస్థలములను స్వహస్తములతో నూడ్చి బాగుచేయుచుండెను. హరిభజనచేయు సమయమున, భక్తులకు విసరుచు, లాంతరు చేఁబూని, గృహముల కేఁగు

భక్తులకు మార్గమును జూపుచుండెను. విఠోబా దేవుని సందర్శించుటకు వచ్చిన భక్తులు దేవళములోని కేఁగఁగనే, ద్వారముకడ నుండి వారి పాదరక్షలను గాపాడుచుండెను. రాజపథమున బరువు మోయుచు కష్టపడుచుండు వారలఁజూచినచో, వారికి కొంచెము శ్రమ తగ్గుటకు తానాబరువును కొంతదూరము మోయుచు, ముసురు పట్టిన దినములలో పథికులను సత్రమునకుఁ గాని, స్వగృహమునకుఁ గాని, దీసికొనివెళ్ళి, తగిన వసతుల నమర్చి సేవఁ జేయుచుండెను. తీర్థయాత్రాపరుల పథ శ్రమ నివారణార్థము, వేడినీళ్ళు కాచి వారి పాదములఁ గడగి, కాళ్లు పట్టుచుండెను. అన్నాతురు లయిన బీదల కిల్లిల్లుదిరిగి అన్నమును దెచ్చిపెట్టుటయు, నీరుదొరకని పశువులకు నీరుపోయుటయు, మేతదొరకని పశువులకు మేతవేయుటయు, నెయ్యి గోధుమపిండి మొదలగువానిని చీమల పుట్టలకడఁ జల్లుటయు, మొదలగు విశ్వ సేవా కార్యములను శక్తివంచన లేక చేయుచు, విశ్వేశ్వరునకుఁ బ్రత్యక్షముగ సేవఁజేయు భాగ్యమబ్బిన దని పరమానంద మగ్నుఁడగుచుండెను.

ఇట్లు తుకారాముఁడు విశ్వసేవావ్రత దీక్షయందుండ, ఒకానొక దినమునందొక వృద్ధాంగన చేతికఱ్ఱపై

శరీరభారమూని, నడువనేరక మెల్లమెల్లగ నడుగులిడుచు దుకాణమున కేఁగుచుండెను. దయార్ద్రచిత్తుఁడగు తుకారాముఁడావృద్ధస్త్రీని జూచి "అమ్మా! నీవు కడు డస్సియున్నావు. కావున నా వీపుపై నెక్కుము. నిన్ను బజారునకుఁ దీసికొని వెళ్లుదును" అని నుడువ నా వృద్ధస్త్రీ యిట్లనియె. "నాయనా! నన్ను మోసికొని వెళ్లుట కష్టము. కాఁబట్టి యీముదుసలిపైఁ గరుణించి బజారున కేఁగి యీపాత్రతో నూనెఁ దీసికొని మాయింటికి రమ్ము. నీవు వచ్చునంతలో, నెమ్మదిగ నేనింటి కేఁగుదును." అను పలుకులాలించి వృద్ధస్త్రీ చేతనున్న పాత్రను గైకొని, బజారున కేఁగి నూనెఁ దీసికొని వచ్చి యామె కిచ్చెను. ఈకార్యము జరిగిన కొన్ని దినములకు తుకారాముని సద్భావమును వెల్లడించుటకు, ఆవృద్ధాంగన ఇరుగు పొరుగిండ్ల వారితో తుకారాముఁడు తెచ్చి యిచ్చిన నూనె చాలదినములవఱకుఁ దఱుఁగకనే యుండెనని చెప్పెను. ఆమాటల వినిన స్త్రీ పురుషులు, తుకారాముని నూనెఁ దెచ్చి పెట్టుమని యాజ్ఞాపింపసాగిరి. సరళస్వభావుఁడగు తుకారాముఁడు, మాఱుమాటాడక నూనె దెచ్చి యిచ్చుచుండెను. కాని యీకార్యము నిత్యకృత్య మయ్యెను. వ్యయములేని యీ భృత్యాని

నిచ్చవచ్చిన పనులయం దుపయోగించుట కెవ్వరును వెనుకంజ వేయరైరి. తుకారాముఁడు చేతనైనంత వఱకు జీవకోటి సేవఁజేయుటచేత, అలసి రాత్రులు దేవళమున కేఁగి, శ్యామసుందర మూర్తిని సందర్శించి, పరమప్రీతి తోఁడ నృత్యముఁ జేయుచు, కీర్తనలను బాడుచుండెను. మఱియు, తన విశ్వసేవావ్రతము సాగుచున్నందుల కెంతయు సంతసించుచు, విశ్వేశ్వరుని కొనియాడు చుండెను. కాని యీకార్యములకు జిజీబాయి సహింపఁ జాలదయ్యెను. ఆరోగ్యవంతులును, దార్ఢ్యము గలవారుఁ గూడ, భర్తచేత బండ చాకిరిని జేయించుటను జూచి పతివ్రతయగు నే స్త్రీ సహించియుండఁ గలదు?

నామదేవుఁడు రచించిన యభంగములు తుకారాముని భక్తివికాసమునకు మిక్కిలి సహకారము లయ్యెను. ఒకప్పుడు, తుకారాముఁడు పండరిపురమున కేఁగుచు, నామదేవవిరచితములగు అభంగములఁ బాడుచు, మైమఱచి, మార్గమధ్యమునం దొకచోట నిద్రింపుచుండెను. అప్పుడాయన స్వప్నమునందు, నామదేవుని వెంటనిడుకొని, విఠోబాదేవుఁడు ప్రత్యక్షమై "ఈతఁడు రచియింపఁ దలఁచిన అభంగములలోఁ గొన్నిఁటిని మాత్రమే రచియించియున్నాఁడు. కావున

మిగిలిన అభంగములను నీవుపూర్తిచేయుము. నీకు నేను జ్ఞానమును బ్రసాదించియున్నాను. నాప్రసాదవాణిని ప్రచారముచేసి మానవసంఘము నుద్ధరింపుము." అనిచెప్పి విఠోబా యంతర్హితుఁడైనంతనే తుకారామునకు నిద్రాభంగమయ్యెను. భగవానున కాత్మసమర్పణముచేయువారలకుఁ బ్రత్యేకముగ స్వతంత్రమనునది యుండదు. కనుక నట్టివారలు తాము చేయు కార్యములన్నియు, నీశ్వర ప్రేరితములని విశ్వసించి ప్రవర్తింపుచుందురు. జాగ్రదావస్థయందే యిట్లు దలంచి ప్రవర్తించుచుండునప్పుడు, స్వప్నావస్థలలోని చింతలు భగవత్ప్రేరితములని భావించుటయం దాశ్చర్యమేమున్నది? కనుకనె స్వప్నదృష్టి ఘటనను తుకారాముఁడీశ్వర విధానమని విశ్వసించి, ప్రప్రథమమున శ్రీకృష్ణుని బాల్యలీలను గ్రంథముఁ రచియించెను.

తుకారాముఁడు సంకీర్తన సమయమున, భక్తులతోఁగూడి అభంగములఁ బాడుచు భావపరవశుఁడగు నప్పు డనేకయభంగము లాయన ముఖవినిస్సృతములగు చుండెను. సముద్రతరంగములవలె పొరలిపొరలివచ్చు నీభావమయకవిత్వము శ్రోతల నమృతవారాశియందు ముంపుచుండెను. వినువారలు విస్మయచిత్తులై, తుకా

రాముని ఈశ్వరాంశ సంభూతునిగ భావింపుచుండిరి. దినములవరుసను జనులు గుంపులు గుంపులుగ వచ్చి తుకారాముని సంకీర్తనలయందుఁ జేరి నామరసమును గ్రోలుచుండిరి. పిచ్చివానిగఁ దలంచుచుండిన వారిప్పు డీయనను మహాభక్తునిగఁ దలంపసాగిరి. తుకారాముని కీర్తనలు నలుదిక్కుల వ్యాపించిన కొలఁదిని, తీర్థయాత్రల కేఁగు ప్రజలవలె దూరదేశములనుండి గూడ జనులు గుంపులు గుంపులుగ వచ్చి యీయన సంకీర్తనయందుఁ జేరుచుండిరి.

ఇంతకుఁ బూర్వము తుకారాముఁడు సంసారమును వీడి నిర్జనస్థలమున కేఁగి, తపస్సు చేసికొన వలయునని తలంచుచుండెను. కాని యిప్పుడు సంసారము నందుండి లోకహితమగు కార్యములను జేయవచ్చునను దలంపున, సంసారమును విడనాడవలయునను సంకల్పమును మానుకొనెను. గృహస్థాశ్రమ పక్షపాతిమైనంత మాత్రమున, తుకారాముఁడు సంసారమునందే మునిఁగియుండెనని భావింపఁ జనదు. అర్థోపార్జనకనుగుణమగు శక్తిప్రవృత్తు లనేకదినములకుఁ బూర్వమే ఈయనను విడనాడియుండెను. ఇందువలన జిజీబాయియే సంసారభారమును భరింపవలసినదాయెను. మహీపతి, ఈమెను

పేర్కొనిన స్థలములం దెల్లఁ దిట్టుబోతనియు, మూర్ఖురాలనియు, వ్రాసియున్నాఁడు. సాధారణముగ మహాపురుషులతోఁ బోల్చి వారిభార్యలగుణములను విచారించుటకుఁ బ్రారంభింతురు గాని వారిని సామాన్య యుత్తమాంగనలతోఁ బోల్చి విమర్శించుటకుఁ బ్రయత్నింపరు. ఇందువలన వీరియం దనేక లోపములు గాన్పించుచుండును. పరిమిత బుద్ధి వికాసముగల సాధారణ యుత్తమాంగనలపైని గురుతరాపరాధమును మోపుట భావ్యముగాదు. కావున జిజీబాయినిగూర్చి యించుక విచారించెదము.

ఈమె సంపన్న గృహస్థునియింట పుట్టి పెరిగి, అట్టివానికికోడలై, దాంపత్యసుఖమునం దోలలాడుచుండెను. కాని యాకస్మికముగ ఘోరతర దరిద్ర దవానలమునఁ దగుల్కొనెను. ఇందువలన నప్పుడప్పుడు, ఉపవాసములు చేయుచుండ వలసినదాయెను. ఇట్టికష్టములయం దసహిష్ణుత ప్రకాశమానమగుట సామాన్యజనుల పక్షమున వింతగాదుగదా? జిజీబాయి తనభర్తయజాగ్రత్తవలననే, తాను దరిద్రదేవతకుఁ బాల్పడవలసి వచ్చెనని విశ్వసించియుండెను. ఈ స్థితియందు దంపతులమధ్య కలహము సంభవించుట వింతగాదు. ఈ

దరిద్రమునకుఁ దోడుగ, సంసారకార్యములయందు విముఖుఁడై, అహోరాత్రు లాధ్యాత్మిక తత్త్వమును బరిశీలింపుచుండు భర్తనుజూచి, ఎంతమంది స్త్రీలహృదయములు కోమలములుగ నుండునో విచారింపుడు! తుకారాముఁడు చేయుకార్యము లతి సాహసముతోఁ గూడుకొనినవై యుండెను. దయార్ద్రచిత్తుఁడగు నితఁ డొకానొకదినమున వస్త్రహీనుఁడగు కడుబీదవానిని జూచి, స్నానమున కేఁగినభార్య కట్టుబట్టను దెచ్చి, యాబీదవాని కిచ్చి విఠోబాకు వస్త్రమును సమర్పించితినని సంతసించెను. కట్టుకొనుటకు మిగిలియున్న యేకవస్త్రముగూడ బోయినప్పుడు, మునిజనోచిత సహిష్ణుత లేనియెడల, సంసారమునందు శాంతియుండుట దుర్లభముగదా? జిజీబాయి మధ్యాహ్నమువఱకుఁ గష్టించి, పరివారమునకుఁ బ్రాణములు నిలుచుటకు సరిపోవు పదార్థములను దెచ్చి, వండి యుండు నప్పటికి, తుకారాముఁడు నలుగురయిదుగురిని వెంట నిడికొని వచ్చుటవలన పచనముచేసినపదార్థములను, అతిథులకును, భర్తకును బెట్టి, పరివారమంతయు, ఉపవసింపవలసి వచ్చుచుండెను. తనభర్తనులోకులు యుక్తాయుక్తజ్ఞానము లేని పిచ్చివాఁడని పరిహసించునప్పుడీమె సహింపఁజాల

కుండెను. జిజీబాయిపుట్టినింట భవానీపూజ చేయుచుండెడిది. అందువలన నత్తవారింటిలోని విఠోబాదేవుని పూజయందంత యనురాగము లేకుండెను. విఠోబాదేవుని భక్తివలన తుకారామున కీయవస్థపట్టినదని లోకులు చెప్పునప్పు డా పలుకులను విశ్వసించి, విఠోబాసేవ మానుమని భర్తతోఁ జెప్పుట సామాన్యస్త్రీల పక్షమున వింతకాదుగదా? ఈకారణములవలన నప్పుడపుడు భార్యాభర్తలకుఁ గలహము సంభవించుచుండెను. కలహము సంభవించినప్పుడు తుకారాముఁడు మాఱుమాటాడక పలాయితుఁడై యామెకోపము చల్లారిన తరువాత గృహమునకు వచ్చుచుండెను. జిజీబాయి కోపస్వభావముగలది యైనను, మిక్కిలి పతిభక్తిగలదై యుండెను. ఇందువలన భర్తభుజింపనిది తాను భుజించునది కాదు. తుకారాముఁడు గృహమును విడిచివెళ్ళుట తటస్థించినయెడల ఆయన తిరిగివచ్చు పర్యంతమీమె యుపవాసములు చేయుచుండెను. కాన తుకారాముని వెదకి తీసికొనివచ్చి, భోజనముబెట్టి, భర్తయుచ్ఛిష్ట పాత్రయందు దాను భుజింపుచుండెను. తుకారాముఁడు భాస్వానాథ పర్వతముమీఁద నివసించునప్పుడు, భోజనమును దీసికొని జిజీబాయి వెళ్ళుచుం

డెను. ఒకానొక దినమునందన్నము దీసికొని వెళ్లుచు నెండతాకుడు వలన నీమె మార్గమధ్యమునందుఁ బడిపోయెను. ఈ దురవస్థనుజూచి నప్పటినుండియు తుకారాముఁడు దేహూగ్రామమునందే నివసించుచుండెను. జిజీబాయి తిట్టుబోతనియు, మూర్ఖురాలనియు, మహాపతివ్రాసియున్నను సంసార కార్యములయందుఁ దప్పులను జూపించినవాఁడు గాఁడు. జిజీబాయి ప్రత్యక్షము మునగాకున్నను, నిజస్కంధమున సంసారభావమును వహించి, ఆర్థిక చింతనుండీ భర్తను నివృత్తునిగ నొనర్చి సహధర్మినీ కర్తవ్యమును నిర్వహించెను. ఇందువలన నీమెయుత్తము రాలనియు, పతిభక్తిపరాయణ యనియుఁ జెప్పుటకు సందియములేదు.

అయిదవ ప్రకరణము

తుకారాముని భగవద్భక్తి నలుదిశల వ్యాపించిన కొలఁదిని, ఆతని మృదుమధుర ధర్మోపన్యాసముల తోఁగూడిన హరికథల నాలించుటకు వేలకొలఁదిజనులు వచ్చుచుండిరని వెనుకటి ప్రకరణమున వివరించియున్నాము. బ్రాహ్మణులు గూడ తుకారామునకు నమస్కరింపుచు, ఈయన యమూల్యధర్మోపన్యాసములను వినినకొలఁదిని శిష్యులగుచుండిరి. గంగాధరపంతను బ్రాహ్మణుఁడును, శంభాజియను దెలుకులవాఁడును, తుకారాముని శిష్యవర్గమునందుఁ బ్రధానులు. తుకారాముని ముఖవినిస్సృత కవిత్వము నెప్పటికప్పుడు గంగాధరపంతు వ్రాయుచుండెను. ఆయన గౌరవ ప్రతిష్ఠలు వృద్ధియైనకొలఁదిని తత్కాలమందలి భక్త వేషధారుల కీయనమీఁద, అసూయ వృద్ధికాఁజొచ్చెను. ఈయన కీర్తివ్యాపించిన కొలఁదిని తమశిష్యసమూహము తఱుఁగుననియు తమగౌరవ ప్రతిష్ఠలు నశించుననియుఁ దలఁచి, అసూయాగ్రస్తులై యనేకులీయనతోఁడ శత్రు

త్వమునకుఁ బూనుకొనిరి. అట్టివారిలోఁ బ్రథముఁడు "మాస్వాజిబాబా" అనుసాధువు. ఈయన దేహూ గ్రామము నందొక మఠమునుగట్టించి యందు నివసించుచుండెను. ఈయనను లోకులు మహాపురుషుఁడని తలంచుచుండిరి. క్రమక్రమముగ తుకారాముని సంకీర్తనల వలన నాకర్షింపఁబడి శిష్యులు తనచుట్టుఁ జేరకుండుటను వగచి, మాస్వాజీ క్రోధాన్వితుఁడై, తుకారాముని సాధించుటకు వేచియుండెను. ఇట్లుండ నొకానొక దినమున తుకారాముని గేదె, విఠోబాదేవళము నానుకొనియుండిన మాస్వాజితోఁటలోఁ జొరఁబడి పూలచెట్లను దినెను. ఇందువలన మాస్వాజి ఆగ్రహగ్రస్తుఁడై తుకారాముని దిట్టసాగెను. కాని తుకారాముఁడచ్చట లేఁడు. ఇదిజరిగిన కొన్నిదినములకు మాస్వాజి యాగ్రహమునకు తుకారాముఁడు లోఁబడవలసినవాఁడాయెను. ఒకానొక యేకాదశి సాయం సమయమున విఠోబాను దర్శించుటకును, సంకీర్తనవినుటకును, దూరప్రదేశములనుండి జనులు గుంపులు గుంపులుగ వచ్చుచుండిరి. మాస్వాజి తనతోఁటచుట్టు దట్టముగను విశాలముగను ముండ్లకంచెను వేయించెను. ఈకంచె విఠోబామందిరమునకు సమీపమందుండుట

చేత, ప్రదక్షిణము చేయునప్పుడు భక్తులపాదములకు ముండ్లు గ్రుచ్చుకొనునని తలఁచి, తుకారాముఁడాకంచెను దీసివైచి, రాలినముండ్ల నూడ్చుచుండెను. సమయమునకు వేచియున్న మాస్వాజి, పరుగిడుచువచ్చి, తుకారాముని జూచి యగ్ని హోత్రమునం దాజ్యముపోసినట్లు మండిపడి ముండ్లమండతోడ పది పదునైదుదెబ్బల నీయన వీపుపైఁగొట్టి, తిట్టుచు మఠమున కేఁగెను. తుకారాముఁడు విఠోబా పాదపద్మములయందు మనస్నిడి హరి నామస్మరణము చేయుచు నిశ్శబ్దముగ దెబ్బలను సహించి, వీపునఁగ్రుచ్చుకొనిన ముండ్లను దీసికొనవలెననియైనఁ దలంపక, విఠోబామందిరమును బ్రవేశించి దేవునిపాదములపైఁబడియేడ్చుచు తనకష్టములను జెప్పుకొనెను. ఈయనదురవస్థను జూచుచున్నవారలు మాస్వాజి శాపము బెట్టునను భయమువలన మాఱుమాటాడక కనులనీళ్ళు కనులగ్రుక్కికొని చూచుచుండిరి. మహాభక్తుఁడగు త్యాగరాజస్వామి విరచితమైన కృతులాయన జీవితఘట్టనలను దెలుపువిధముననే, తుకారాముని అభంగములాయనజీవిత చారిత్రమును దెలుపుచుండును. ఈవిషయమునందు తుకారాముఁడు చెప్పిన ఆరుభంగములలో నొకదాని తాత్పర్యమిందుదాహ

రించుచున్నాను. "ఓభగవానుఁడా? దుర్జనుల సహవాసమువలన సాధుపురుషుల మానసిక శాంతిదూరమగునని తెలిసికొనుటకు నాకీశిక్షనువిధించి యున్నావు. ఇంతటినుండియు దుర్జనులకు దూరమందుండఁ బ్రయత్నింతును" కఠోర సంయమద్వారమున మనోశరీరములను వశపఱచుకొనిన, తుకారాముఁడు శత్రువు గొట్టు దెబ్బలను నీరవముగ సహించి యింద్రియనిగ్రహుఁడయ్యెను. గృహమున కేఁగఁగనే జిజీబాయి తుకారాముని శరీరమునుజూచి దుఃఖించి, గ్రుచ్చుకొనిన ముండ్లను బెఱికి శుశ్రూషఁజేయఁ గొంతవడి కాయన స్వస్థతఁజెందెను. సంకీర్తనకుఁ గావలసిన పదార్థములన్నియు సంసిద్ధమయ్యెను. ప్రతి సంకీర్తనకువచ్చుచుండు మాస్వాజిసిగ్గుపడి, ఆదినమున రాఁడయ్యె. అందువలన తుకారాముఁడాయనను బిలుచుకొనివచ్చుటకు తనశిష్యులనుబంప, సర్వాంగములు వేదనతోఁగూడుకొని యుండుటవలన రాఁజాలనని మాస్వాజిచెప్పెను. ఆనుడువులాలించి తుకారాముఁడాయన మఠమున కేఁగి సాష్టాంగనమస్కారమొనర్చి యిట్లనియె. "స్వహస్తముతోఁనన్ను గొట్టుటవలన మీసర్వాంగములు వేదనతోఁగూడుకొని యున్నవి. తోఁటచుట్టు వేయించిన

మీకంచెను బెకలించి మీకాగ్రహమును గలిగించిన నన్ను మన్నింపుఁడు. ప్రేమపురస్సరముగ సంకీర్తనాస్థలమునకు విచ్చేయుఁడు." అని ప్రార్థింపుచు మాస్వాజి శరీరమును బట్టుటకుఁ బ్రారంభించెను. ఈకార్యమువలన మాస్వాజి లజ్జితుఁడై, తుకారామునితోఁగూడి సంకీర్తనా స్థలమునకువచ్చెను. గతరాత్రి తుకారామునిగేదెను దొంగలించుకొని వెళ్లిన దొంగలేదియో యొక యలౌకిక క్రియాసందర్శనము వలన భీతులై, గేదెనుదోలుకొని సంకీర్తనాస్థలమునకువచ్చి, తుకారాముని శరణుఁజొచ్చిరి. అప్పుడు, తుకారాముఁడు దొంగల వంకఁజూచి, "గేదెకావలసియుండిన తోలుకొనిపొండు. కాని దొంగతనముచేయుట మహాపాతక" మనిచెప్పి దొంగలను బంపివేసెను. ఈవిషయము ప్రత్యక్షముగఁ జూచిన మాస్వాజి, తుకారాముని యసాధారణమహత్వమునకు ముగ్ధుఁడై వైరభావమును వీడి ప్రీతి మెయి మెలంగు చుండెను.

ఎటువంటి భక్తుఁడైనను గురూపదేశము బొందనిది భక్తిరాజ్యమునందుఁ బ్రవేశించుటకు వీలులేదని భారతీయుల విశ్వాసము. ఆవిశ్వాసానుసారముగనే ఆజన్మతపస్వియగు ధృవుఁడు ప్రప్రథమమున, నారదుని

వలన మంత్రోపదేశమును బొందినటులు పురాణములయందు వర్ణింపఁబడియున్నది. సహిష్ణుత, కఠోరసంయమము మొదలగు గుణముల నార్జించియున్న తుకారామునకు స్వప్నమునందు, విఠోబాదేవుఁడు స్వయముగ మంత్రోపదేశమును జేసెనని వ్రాసిన చరిత్రకారులలో మహీపతి యిట్లు వ్రాయుచున్నాఁడు. "తుకారాముఁడు పండరిపుర నాథునిధ్యానించుచు నిద్దురఁబోయెను. స్వప్నమునం దింద్రాణీ నదీజలముల స్నానమాడి విఠోబా మందిరమునకువచ్చుచు, ఆమార్గముననే యేఁగుచుండిన యొకవృద్ధబ్రాహ్మణునిజూచి యభ్యాసానుసారముగ తుకారాముఁడాయనకు సాష్టాంగదండప్రణామంబొనర్చెను. ఆయన తుకారాముని తలపైఁజేయిడి లేవదీసి కూర్చుండఁబెట్టి "రామ, కృష్ణ, హరి" అనుమంత్రము నుపదేశించి, రాఘవచైతన్యుని శిష్యుఁడు కేశవచైతన్యుఁడనియు, కేశవచైతన్యుఁడు తనకు గురువనియు, తనపేరు బాబాజీచైతన్యుఁడనియుజెప్పి, పాండురంగనాథుని విడువకుండుమని నుడివెను. ఈ నుడువు లాలించి తుకారాముఁడు పరమ ప్రీతినొంది సాష్టాంగదండప్రమణామం బాచరించి, మీరీదినమున మాగృహమును బవిత్రముచేయవలయునని ప్రార్థింప

బ్రాహ్మణుఁడాప్రార్థనను విని, తుకారాముని గృహమునకు వచ్చెను. అతిథిని వెంటనిడుకొని వచ్చిన తుకారామునితో, జిజీబాయి పోట్లాడుటకుఁ బ్రారంభించినంతన, బ్రాహ్మణుఁ డంతర్థానమయ్యెను. అంతట తుకారాముఁడు మేల్కొనియె."

పగలు యోజించు యోజనలు, రాత్రులు స్వప్నములయందు ప్రత్యక్షమగుట సర్వసాధారణ విషయము గదా? అతిథి యభ్యాగతుల సేవావిషయమున భార్యాభర్తలకుఁ దఱచుగా కలహము జరుగుచుండుట వలన తుకారామునకు మిక్కుటమగు మనోవ్యథ గలుగుచుండెను. ఈయన స్వప్నదృష్టబ్రాహ్మణుని దలంచుకొని, స్వప్నమందును మనోశాంతి లేనందులకుఁ జింతించి, సంసారమును బరిత్యజించుటయే యుత్తమమని దలంచుకొని "బొల్లాల" అను పేరుగల యరణ్యమున కేఁగెను. ఆ యరణ్యమునుండివచ్చి ప్రతిదిన ముదయమును, ఇంద్రాణియందు స్నానమాడి విఠోబాదేవుని పూజించి, మఱల యరణ్యమున కేఁగుచుండెను. ఇప్పటికీయన జనసంఘమునందు, మహాభక్తుఁడని పరిగణింపఁబడుచున్నందున, జనులాహార ద్రవ్యములను దీసికొని వెళ్లి తుకారామునకిచ్చి వచ్చుచుండిరి. కాని యాహారము

లభింపని దినములయం దుపవాసము చేయు చుండెను. దాదాపు రెండు నెలలీవిధముగ జరిగిన పిమ్మట యొకనాఁ డింద్రాణీ నదీజలముల స్నానమాడు సమయమున జిజీబాయి వచ్చి తుకారాముని చేలాంచలముఁ బట్టుకొని యిట్లనియె. "మమ్ము విడనాడి రెండు మాసములుగ మీరరణ్యవాసము చేయుచున్నారు. మా సంగతియే మీ మనమునం దున్నటులు దోఁపదు. కనుక మేమెట్లు జీవింతుము?" అను మాటలు విని "విఠోబాయు, రుక్మిణియు, సమస్తజగత్తునకుఁ దలిదండ్రులు. కావున నీవు వారి శరణుఁ జొరుము. నీయభావములన్నియుఁ బూర్తియగును" అను పలుకులు విని జిజీబాయి దీనస్వరమున నిట్లు విన్నవించుకొనెను. "నేనెప్పుడును మీధర్మకార్యములకు వ్యాఘాతము గలిగింపను. కావున గృహమునకు వచ్చి మీచిత్తానుసారముగ హరిభజనను జేసికొనుచుండుఁడు." అను ప్రార్థన కంగీకరించి, తుకారాముఁడు మరల స్వగృహమున కేఁగెను.

తుకారాముఁడు స్వగృహమున కేఁగి ప్రాంగణమునందలి తులసిమండపముమీఁదఁ గూర్చుండి హరిభజనఁ జేసికొనుచు, ధర్మోపదేశములను జేయుచు, హరికథలను జెప్పుచుండెను. సమయము దటస్థించినపుడెల్ల, అర్థాం

గికి భక్తితత్త్వమును బోధించి, మననము చేయవలయునని, ప్రోత్సాహపఱచుచుండెను. కాని తుకారాముని దర్శనార్థము వచ్చు, జనులచే గృహము నిండి యుండుటను జూచి, అపుడపుడు జిజీబాయి చిరాకుపడుచుండుటచేత నామెకు "పూర్ణబోధ" యని పిలువఁబడు పదునొకండు అభంగములతోఁడ ధర్మోపదేశమును జేసెను. ఆయభంగములలో నొకదాని తాత్పర్య మీక్రింద నుదాహరించుచున్నాను. "విఠోబా సేవఁ జేయుచుండుట వలన సమస్తమానవులును మనకు బంధువులైరి. స్వకార్యములఁ బరిత్యజించి దూరదేశములనుండి వేనవేలుగ జనులు వచ్చుటకు కారణము విఠోబానామామృతమును గ్రోలుటకే కదా? అట్టివారియెడల నీవు పరమ ప్రీతిని జూపవలదా? పుత్రికాపుత్రుల విషయమున నీకింత చింతయేల? జగద్రక్షకుఁడగు విఠోబాపైన భారముంచి మెలంగుచుండుము. నీకే విధమగు లోపము లుండవు. సంసారముమీఁద మమతయున్నంత కాలమును, హరిభక్తి లభించుట దుర్లభము. రేపు శుభదినముగాన, చిత్తమును విఠోబాచరణకమలములయం దర్పించి, గృహమునందున్న సమస్తవస్తువులను, బ్రాహ్మణులకు సమర్పించి, దాసురాలవై యనన్యచిత్తమున భగవద్భక్తుల శరణుఁ జొరుము. భక్తుల సేవయందు

నిమగ్నురాలవై భావిచింతనుండి విముక్తినొందుము. క్షణభంగురమగు ఇహసౌఖ్యములఁబరిత్యజించి విఠోబానామామృతమును గ్రోలుము. అప్పుడు నీవు పరమానందమును బొందుదువు." ఈయుపదేశమును జిజీబాయివిని మఱుదిన ముదయమున సర్వస్వమును బ్రాహ్మణులకర్పించుట కంగీకరించెను. మఱునాఁడు గృహమునందలి సమస్త వస్తువులను దానముచేయుటకు మొదలిడి చివఱకు భోజనపాత్రలనుగూడ నీతఁడు పంచిపెట్టెను. అన్నియు దానముచేసిన పిదప నొకబీదస్త్రీ, వస్త్రమిమ్మని తుకారాముని బ్రార్థించెను. అప్పుడీయన జిజీబాయి కట్టుకొనుటకు మిగిలియున్న చిరుగులచేల నొక్కదానిని యాస్త్రీకి దానము జేసెను. జిజీబాయి యంతవఱకును గంభీరముగఁ జూచుచుండెను. కాని లజ్జానివారణార్థము మిగిలియున్న చిరుగులచీర యొక్కటియుఁ బోవుటవలన ధైర్యచ్యుతయై తుకారామునిఁదూలనాడెను. జిజీబాయిని తిట్టుఁబోతనియు, మూర్ఖురాలనియు, నిర్ధారణఁ జేయునప్పుడు, ఆమె యెటువంటి కఠినపరీక్షలయందుఁ బరీక్షింపఁబడుచుండెనో, గమనించుట యత్యావశ్యకము.

తుకారామునకు కాశీ, భాగీరథీ, గంగయను ముగ్గురు కొమార్తెలును, మహాదేవుఁడు, విఠోబాయను,

ఇద్దఱు పుత్రులునుండిరి. వివాహామునకుఁ దగినవయస్సు వచ్చినందువలన, పెద్దకుమార్తెకుఁ దగిన సంబంధము విచారింపుఁడని జిజీబాయి తొందరఁబెట్టసాగెను. ఒకానొక శుభదినమున తుకారాముఁడు రాజవీథిలోనికరిగి, అచ్చట నాడుకొనుచుండిన ముగ్గురు స్వజాతిబాలురను వెంటనిడుకొనివచ్చి మువ్వురకు మువ్వుర పుత్రికలనిచ్చి వివాహమొనర్చెను. కాని అల్లుండ్రను సత్కరించుటకు ధనమెక్కడ! అందువలన వారికిజొన్నబియ్యపుఱొట్టెను, భోజనమునకు మాఱుగఁబెట్టెను. మఱుదినమునం దీసమాచారము వరులతలిదండ్రులకుఁ దెలిసి వారు తుకారామునివంటి మహాభక్తునితోఁడ సంబంధముగలియుట కెంతయు సంతసించిరి.

తురాకారముఁడు రచియించిన "ఉత్తమజ్ఞానము" అనఁబడు పదునొకండభంగములీ సందర్భమునఁ జెప్పబడినవను వాడుకగలదు. ఒకానొక జ్ఞానపిపాసియగు బ్రాహ్మణుఁడు, పండరిపురనాథుని శరణుఁజొచ్చియుండెను. ఇట్లుండ కొంతకాలమునకు విఠోబాదేవుని యాదేశప్రకారము జ్ఞానేశ్వరుని సమాధియొద్ద కేఁగి ఆరాధనఁ జేయుచుండ నచ్చటనైన యాదేశప్రకార మాబ్రాహ్మణుఁడు దేహూ గ్రామమునకువచ్చి తుకారాము నాశ్ర

యించెను. అప్పుడు తుకారాముఁడు "ఉత్తమజ్ఞాన"మను పదునొంకండభంగములను, భగవత్ప్రసాదమగు నొక నారికేళఫలమును, బ్రాహ్మణునకొసంగెను. దేవభాషయగు సంస్కృతమందుఁ గాక, దేశభాషయగు మహారాష్ట్రమునందభంగములుండుటచేతజ్ఞానాభిమానియగు బ్రాహ్మణునకాయభంగములు రుచింపకుండెను. అందువలన నాయభంగములను, నారికేళఫలమును, అచ్చటనే దిగవిడిచి యాయనతిరిగి జ్ఞానేశ్వరునియొద్ద కేఁగెను. ఆ బ్రాహ్మణుఁడేఁగిన కొండొకవడికి "ఖండోబా" యను బ్రాహ్మణుఁడు వచ్చి బ్రాహ్మణునిచే విడువఁబడిన యభంగములను, నారికేళఫలమును గైకొనెను. అప్పటినుండియు నాయన భక్తిభావము వికసింపనారంభించెనని చెప్పుదురు.

ఈనారికేళఫలమునుగూర్చి యింకొక నాడుక గలదు. "ఒకానొకధనికుఁడు తన కార్యసిద్ధియైనచో జ్ఞానేశ్వరునకు విస్తారధనమును జెల్లింతునని మ్రొక్కుకొనెను. కార్యసిద్ధియైనపిమ్మట జ్ఞానేశ్వరుని యాదేశానుసార మాధనము తుకారామునకు సమర్పింపవలసియుండెను. కాని తుకారాముఁడు ధనమును స్వీకరింపఁడను తలంపున, ఆ ధనికుఁడు నారికేళఫలమునందు

ముత్యములు వజ్రములు మొదలగువాని నిమిడ్చి దానిని తుకారామునకు సమర్పించుకొనెను. దానినే యీశ్వరప్రసాదమని తుకారాముఁడు బ్రాహ్మణునకొసంగెను. కాని చివఱకది ఖండోబాయను బ్రాహ్మణునకుదక్కెను. దీనిని ఖండోబా పగులఁగొట్టి యందున్న ముత్యములను, రత్నములనుజూచి, తుకారాముని మహాత్వమువలన లభించెనని సంతసించెను." కాని యీఘటనవలన తుకాగాముని కీర్తి దేశదేశములయందేవిధముగ వ్యాపించెనో చదువరులే గ్రహించెదరు గాక !

ఆఱవ ప్రకరణము

తుకారాముఁడు చుట్టుపట్లగ్రామముల కేఁగి హరి కథలను జెప్పుచుండెను. క్రమక్రమముగ ననేకు లీయన మార్గానువర్తులగుచుండిరి. జను లీయన ననుసరించిన కొలఁదిని యీర్ష్యాప్రధానులలోఁ గొందఱు, తుకారాముని కష్టపెట్టుట కారంభించిరి. శూద్రకుల సంజాతుఁడైన తుకారాముఁడు బ్రాహ్మణులకుఁగూడ ధర్మోపదేశములను జేయుచున్నాఁడని కొందఱును, శాస్త్రమర్మము లంత్యజాతులవారికిఁ బోధింపుచున్నాఁడని మఱికొందఱును, ఆగ్రహగ్రస్తులగుచుండిరి. రామేశ్వరభట్టను పండితుఁడాకాలమునందు, సనాతనధర్మ రక్షకుఁడను ఖ్యాతిని గాంచియుండెను. ఆయన, తుకారాముఁడుపదేశించు భక్తిమార్గం బంగీకరింప కుండుటయేగాక సాధారణశాస్త్రాభిమానులగు పండితులవలెనే, మూఢుఁడనియు, ధర్మోపదేశమును జేయుట కనర్హుఁడనియుఁ దలంచి క్రోధావేశపరవశుఁడై యీతని నణఁగఁద్రొక్కుటకు సమకట్టెను. ఒకానొకదినమున రామేశ్వర

భట్టు దేహూగ్రామాధికారి యొద్దకేఁగి యిట్లనియె. "తుకారాముఁడు శూద్రకుల సంజాతుఁడైయుండియు, శ్రుతిమర్మములను వెల్లడింపుచున్నాఁడు. శాస్త్రానుసారమగు క్రియాకలాపముల కుత్సాహమియ్యక, మధురమును, మోహోత్పాతకమునైన సంగీతమువలన సరళచిత్తులగు లోకులను మతిభ్రష్టులుగ నొనర్చి, బ్రాహ్మణుల నమస్కారములు గూడ గైకొనుటకు జంకక హరినామ మహిమను బ్రచారముచేయుచు, భక్తిపదమును స్థాపింపఁ బ్రయత్నింపుచున్నాఁడు. కావున ధర్మవిప్లవకారుఁడును, బ్రాహ్మణవంచకుఁడును, పాషండమతస్థాపకుఁడునగు, తుకారాముని శిక్షించి, ధర్మము నుద్ధరింపవలయును." అను వాక్యములవిని యాయధికారి, తుకారాముని గ్రామమునుండి వెళ్లఁగొట్టవలయునని, దేహూగ్రామముయొక్క పటేలున కాజ్ఞ నొసంగెను. ఈ యాజ్ఞనువిని తుకారాముఁడు నిరుపాయుఁడై, విఠోబాదేవుని, పితృపితామహ వాసస్థలమును విడనాడఁజాలక రామేశ్వరభట్టు శరణుఁజొచ్చుటకు నిశ్చయించుకొని యాయన సంధ్యావందనం బొనర్చుకొను సమయమున, తుకారాముఁడేఁగి సాష్టాంగ దండప్రణామం బొనర్చి హరినామస్మరణఁ జేయుచుండెను. కాని రామేశ్వర

భట్టు, ఈయనను జూచినంతటనే, తోఁకద్రొక్కిన త్రాచువలెలేచి మండిపడుచు "తుకారాముఁడా ? నీవు శూద్రుఁడవు. సంకీర్తనలయందు శ్రుతులలోని మర్మములను వెల్లడించు కవిత్వమును జెప్పుచున్నావు. ఇందువలన నీవును, వినువారలును, మహాపాతకమును బొందుదు"రని చెప్పు నుడువులాలించి తుకారాముఁడు విఠోబా దేవుని యాదేశానుసారమునఁ గవిత్వమును జెప్పుచున్నానని విన్నవింప, రామేశ్వరభట్టుయిట్లనియె. "వేదసాస్త్ర పురాణములయందుఁ గొఱవడిన ధర్మము లుపదేసింపుమని విఠోబా నీకాజ్ఞయొసంగినాఁడు కాబోలును! నీకవిత్వమువలన మహాపురుషుల యుపదేశములు నశించుకాల మాసన్నమైనది లోకులు నీయభంగములోని మృదుమధురరసము నాస్వాదించి పూర్వపురుషుల యుపదేశములు వినుటకుఁగూడఁ బ్రయత్నింపకున్నారు. ఇందువలన నుత్తమధర్మము లోపించునను సందియము కలుగుచున్నది. కావున నీవింతటినుండియు అభంగములఁ జెప్పఁజనదు" అను వాక్యములను తుకారాముఁడు శిరస్సునధరించి యిట్లనియె. "ఇంతవఱకు నేనురచియించిన అభంగముల విషయమున తమయాజ్ఞను వినఁ గోరుచున్నాను. అన రామేశ్వరునిభట్టు అణు

మాత్రమైనను యోజింపక, యిట్లనియె. "ఆ యభంగములన్నిటిని యింద్రాణీ నదియందునఁ బడవేయుము." తుకారాముఁడీ హృదయభేదకములగు పల్కులాలించి, తల్లడిల్లుచు, నోటమ్మాటరాక. కొంతవడికిఁ దెప్పిఱిల్లి స్వగృహమున కేఁగెను.

ఉత్కృష్టరచనమైనను లేక నికృష్టరచనమైనను, ఎవరు రచియించిన రచనమీఁద వారికి పుత్రవాత్సల్యమునకంటెను, వేయిమడుంగు లెక్కుడు మమకారముండుట సహజముకదా! తుకారాముఁడు ప్రఖ్యాతికొఱకుఁగాని, ధనమున కాశించిగాని, అభంగములను రచించినవాఁడుగాఁడు. తన ప్రాణముయొక్క నిగూఢాభిప్రాయములను బ్రాణేశ్వరునకు నివేదించుకొనుటకాతఁడు, అభంగములఁ జెప్పెను. కావున నీయభంగములే యీయన సర్వస్వమైయుండెననుట నతిశయోక్తి కాదు! బ్రాహ్మణుఁడు దేవతాస్వరూపుఁడను నమ్మకముగల తుకారాముఁడు, రామేశ్వరభట్టు నాజ్ఞకు మారాడక, హృదయవేదనను బొందుచుఁ గన్నీరు మున్నీరుగ నేడ్చుచు, అభంగముల గ్రంథమును ఇంద్రాణీనదియందుఁ బడవైచుటకు సంసిద్ధుఁడై, విఠోబాదేవుని సంపత్తిని నదీజలముల విసర్జించి, ఆయన దర్శన

మున కెళ్లఁగఁగలనని తలఁచి, విఠోబా మందిరమును ప్రవేశించెను. నూతనాభంగముల రచననుగూడ నిషేధించుటవలన, నాయన దుఃఖ మసహనీయ మయ్యెను. తల్లినిగౌఁగలించుకొని యేడ్చుశిశువువలె, తుకారాముఁడు విఠోబాను గౌఁగిలించుకొని యిట్లనియె. "ప్రభో! నీవీ జగత్తునకు కర్తవు, నీకరుణాప్రసాదమువలన నేనీయభంగములను రచియింపఁ గలిగితిని. తిరుగ నీవే యాబ్రాహ్మణుని జిహ్వాయందుండి వానిని యింద్రాణీయందుఁ బడవేయ నాజ్ఞయొసంగి యున్నావు. కావున నీయాజ్ఞ నెఱవేరునుగాక" అనుచు దేవళమునువిడిచి, నదీతటమును జేరి జొటజొటరాలు కన్నీరు కాల్వలై పాఱ, హరినామస్మరణఁ జేయుచు, అభంగముల గ్రంథము నొకరాతికి గట్టి వస్త్రమునుజుట్టి దాన్నిని విడువఁజాలక విడువఁజాలక, నదీజలమునవిడిచి, రోదనముచేయసాగెను. ఈయన యైహికసంపదను విసర్జించునప్పు డణుమాత్రమైనను, విచారమును బొందియెఱుగఁడు. కాని యభంగముల నింద్రాణీనదీజలములకర్పించి, మేరలేని హృదయవేదనఁ బొందుచు, ఆహారపానీయముల వర్జించి విఠోబామందిరమున కెదుటనుండు తులసికోటపైఁ బరుండి, విఠోబాధ్యానమున నిమగ్నుఁడై యుండెను. ఈ

విధముగ పదుమూఁడుదినములు గడచిన పిమ్మట దేహూగ్రామవాస్తులలోఁ గొందఱకుస్వప్నమందు విఠోబా ప్రత్యక్షమై "తుకారాముని యభంగముల గ్రంథము ఇంద్రాణీనదియందు భద్రముగనున్నది. మీరుదానిని దెచ్చి తుకారామున కీయవలయును" అని చెప్పెను. మఱునటిదిన ముదయమున దేహూగ్రామవాసులకు నింద్రాణీనదియందు, అభంగముల గ్రంథము దొఱకెను. వారాగ్రంథమును తుకారామున కర్పింప, మరణించిన బాలుఁడు సజీవుఁడైనప్పుడు తల్లి యెట్టియానందము ననుభవించునో అట్టియానందమును బొందుచు, భావోన్మత్తుఁడై, ఆడుచు పాడుచు, ఎనిమిది యభంగములను రచించెను. రామేశ్వరభట్టు అభంగముల గ్రంథమును, ఇంద్రాణియందుఁ బడవేయవలయునని తుకారామున కాజ్ఞయొసంగి, శిష్యగణపరివేష్టితుఁడై, నాగనాథమను సుప్రసిద్ధశివలింగమును బూజించుటకు బయలుదేరి, పథమధ్యమునందొకానొక ముసలమాన ఫకీరుని యుద్యానవనములోని జలాశయమున. స్నానమొనర్చుచుండెను. అప్పుడీతని పూర్వోత్తర సందర్భముల నాఫకీరడిగెను. దానికి సరియగు జవాబుచెప్పక, మీఁదు మిక్కిలి యవమానజనకమగు భాషను ప్రయోగించి

నంమువలన, ఫకీరు క్రోధాన్వితుఁడై యాతనిఁదిట్టెను. అందువలన స్నానానంతరము రామేశ్వరభట్టుని శరీరము మంటలెత్తసాగెనట! శరీరవేదన సహింపఁజాలని రామేశ్వరభట్టును ఫకీరు శరణుఁ జొరుమని శిష్యులనిరి. కాని, యాతఁడు, ముసలమాను ఫకీరునకు శరణార్థి యగుట కంగీకరింపక, జ్ఞానేశ్వరుని సమాధియొద్ద కేఁగి రక్షింప వేఁడుకొనుచుండెను. ఇట్లుండ రామేశ్వర భట్టున కొకనాఁడుజ్ఞానేశ్వరుఁడు స్వప్నమునందుఁ బ్రత్యక్షమై యిట్లనియె. "భగవద్భక్తుఁడగు తుకారాముని కష్టపెట్టుటవలన నీకీగతి పట్టినది. కావున నీవాయనశరణుఁ జొరుము" అనునుడువులాలించి మేల్కొని తుకారాముని, అభంగములు తిరుగ లభించిన వృత్తాంతమును శిష్యులవలన విని, స్వయంకృతాపరాధమునకు లజ్జితుఁడై, తన శరీరాస్వస్థతను దెలుపునొక లేఖను వ్రాసి, తుకారాముని కడకంపెను. తుకారాముఁడాలేఖను జదువుకొని యాయన దుర్దశకు వగచి, ఈ క్రింది యభిప్రాయముగల యభంగమును బ్రత్యుత్తరము క్రిందఁ బంపించెను. "హృదయము నిర్మలమైన యెడల శత్రువులు హృదయ సమానులగుదురు. కావున సర్వభూతసమత్వముగలిగి విఠోబాదేవుని శరణుఁజొచ్చి మనుము."

ఈయభిప్రాయముగల అభంగమును చదువుకొనినంతటనే రామేశ్వరభట్టుయొక్క శరీరతాపము చల్లారెనని మహీపతి వ్రాయుచున్నాఁడు. శరీరతాపము చల్లారఁగనే, రామేశ్వరభట్టు తుకారాముని జూచుటకు బయలుదేరెను. ఈవార్త విని తుకారాముఁ డెదురేఁగి మార్గమధ్యమునందు రామేశ్వరభట్టును గలసికొని వందనం బాచరించెను. రామేశ్వరభట్టుని జతుర్వ్యవహారమునకుఁ బరితాపము నొందుచు యిట్లనియె.

"ప్రేమాపురస్సరముగ మీరు బంపించిన యభంగమును జదువుకొనుటవలన నాశరీరతాపము చల్లారుటయేగాక జ్ఞానోదయమయినది. నేనిఁక మీశిష్యవర్గమునఁ జేరి మిమ్ము విడనాడక దిరుగుచుందును." అని నుడువుచు, విద్యాభిమానము, కులగౌరవము, సాంసారిక ప్రతిష్ఠయందలి మోహమును దెగఁద్రెంచుకొని, తుకారాముని నాశ్రయించి, హరినామామృతమును గ్రోలుచుండెను.

ఇదేవిధముగ ననేకుల వలన తుకారాముఁడనేక కష్టము లొందవలసిన వాఁడయ్యెను. ఈయన శిష్యులలో కంచరపని చేయువాఁ డొకఁడుండెను. వాని పేరు శివాజి. అత్యంత సంసారాసక్తుఁడగు శివాజి, ప్రప్రథ

మమున తుకారామునిపై ద్వేషము కలిగియుండి తుదకు తుకారాముని ధర్మోపదేశశ్రవణమువలన మనోపరివర్తనుఁడయ్యెను. ఇందువలన శివాజి సంసార ధర్మములన్ని విడనాడి, రేయింబవళులు తుకారాముని వెన్నంటి దిరుగుచు, సాధుసజ్జన సేవకు తన సర్వస్వము నర్పింపుచుండెను. దీనిని జూచి యాయనభార్య సహింపఁజాలక తనభర్త చెడి తిరుగుటకుఁ గారకుఁడగు తుకారామునిఁ గడతేర్పవలయునని తలఁచి, తనయింటికాయనను భోజనమునకుఁ బిలచెను. స్నానమునకు శరీరము బొబ్బలెక్కునంతటి వేడినీళ్ళిచ్చి, విషమిశ్రిత పదార్థములఁ గుడువఁబెట్టెను. భగవానుని యనుగ్రహమువలన, విషమిశ్రితపదార్థము లీయనకుఁ బ్రమాదముఁ గలిగింపఁజాలకున్నను, వేడినీళ్ళస్నానమువలన శరీరము బొబ్బలెక్కెను. తుకారాముఁడీ దురవస్థను విఠోబాపాదములపైఁబడి విన్నవించుకొనెనేగాని, శివాజీ భార్యపైని యణుమాత్రమైనను గోపమును జెందఁడయ్యె. ఒకటిరెండు దినములలో తుకారాముఁడు స్వస్థతనుజెందెను. కాని ఇందువలన ధూర్తురాలగు శివాజిభార్య కుష్టురోగగ్రస్తురాలయ్యెననియు, తుకారాముని కరుణవలన కుష్టురోగమునుండి యామె ముక్తినొందెననియు, మహీపతి వ్రాయుచున్నాఁడు.

ఈయన యాత్మసంయమమున కొక దృష్టాంతమును మహీపతి జూపియున్నాఁడు. ఒకానొకసమయమునందొకస్త్రీ తనపాపాభిలాషను తుకారామునకుఁ దెలియపఱచెను. కాని యాయన యాస్త్రీని మాతృసంబోధనముఁ జేసి పిలచుటవలన, ఆమె లజ్జితయై యప్పటినుండియు సన్మార్గగామినియయ్యెను. తుకారాముఁడీమెను మాతృభావమునఁ జూడఁగలుగుటకు కారణము ఆత్మసంయమమేకదా! ఇట్టి యాత్మసంయమముగల మహాపురుషులనే మృతజీవులందురు !

ఏడవ ప్రకరణము

భక్తులభావములయం దీశ్వరప్రకాశమును జూడఁగలము. శిశువుచేయు ప్రతికార్యమందును, తల్లిప్రకాశించుచుండువిధముననే, భక్తునియొక్క సమస్తకార్యములయందును, పరమేశ్వరుఁడు ప్రకాశింపుచుండును. భక్తుని ప్రయత్నము లెప్పుడును వ్యర్థములు గావు. భక్తుల పిలుపునకు భగవానుఁడు పలుకుచుండును. భక్తుల యాశయములను బూర్ణ మొనర్చును. వారిహృదయములయం దధిష్ఠించియుండును. ఇందువలన, భక్తునిముఖద్వారమున, భగవానుని సౌందర్యమును జూడఁగలము. భక్తునివాణిగుండ, ఈశ్వరవాణిని వినఁగలము. భక్తుని యంగమునుండి యాయన ప్రేమాసౌరభము నాఘ్రాణింపఁగలుగుదుము. స్పర్శమణియగు భగవానుని స్పర్శనమువలన, భక్తునికబ్బు శక్తికి మేరలేదుకదా! భక్తుఁడను తృణమును, భగవంతునితోఁ గేళి సల్పుచుండుటవలన, ననాయాసముగ, కష్టములను, మరణమును, తుచ్ఛముగ చూడఁగలుగుచున్నాఁడు. మహారాజాధిరాజుల

శిరముల నలంకరించు, మణిమయమకుటములను, ధూళితో సమముగఁ జూచి, పదతాడనము చేయఁగలశక్తి భక్తునకుఁ గాక మఱియెవ్వరికిఁ గలదు?

మహారాష్ట్రజాతీయనిర్మాణకర్తలగు, తుకారాముడును, రామదాస స్వామియు, శివాజియు; పరస్పర సంబంధనముఁ గలిగి మహారాష్ట్ర జాతీయాంతర్గతమగు భక్తిజ్ఞానకర్మను ప్రబోధింపఁజేసి, అఖండ మహారాష్ట్ర సామ్రాజ్యమును స్థాపింపఁ గలిగిరి. ఈమువ్వురిలో తుకారామునకును శివాజికిని గల సంబంధమును వర్ణించుటవలన, వీరి ధర్మాభిలాషయు వైరాగ్య శీలతయు వెల్లడి కాఁగలవు. శివాజియొక్క పరాక్రమమును గూర్చియు, బుద్ధిచాతుర్యమును గూర్చియు, కార్యనిర్వహణదక్షతను గూర్చియు, తఱుచుగ వినుచుందుము. కాని యాయన భక్తిని గూర్చి మనకంతఁగాఁ దెలియదు. కాని శివాజీ ధర్మానురాగమును జూచినచో ఈయన రాజుగాక సన్న్యాసియైనను, శాశ్వతముగ జాతీయ చిత్రపటమునందుఁ జిత్రింపఁబడి యుండునని చెప్పుటకు నిస్సంశయము.

కడుబాల్యము నుండియు, తల్లియగు జిజీబాయి వలన, పురాణములోని కథలను వినుచుండుటచేత,

శివాజీ హృదయమునందు, స్వదేశాభిమానమును, స్వధర్మనిరతియు, దట్టముగ నాటుకొని యుండెను. ఇందువలన స్వధర్మరక్షణార్థము స్వరాజ్యస్థాపనమే మార్గమని యెంచి తుకారాముని భక్తి వలనను, రామదాసస్వామి జ్ఞానము వలనను ప్రబోధింపఁ బడుచున్న మహారాష్ట్రులకు, కార్యనిర్వహణదీక్ష నొసంగి, అఖండ మహారాష్ట్ర సామ్రాజ్యమును స్థాపించెను. శివాజీకి సంరక్షకుఁడుగ నుండి, ఆయన భావికాలోన్నతి కనుగుణమగు శిక్ష నొసంగుచుండిన వారిలో ముఖ్యుఁడగు *దాదాజీ కొండదేవుఁడు 'స్వరాజ్యస్థాపనా వ్రతము సంపన్నము గావలయునని సాధు పురుషుల దీవనలొందుటయు, వారియుపదేశముల వినుచుండుటయు, అత్యావశ్యకము'

* ఒకప్పుడు తుకారాముని మతమునకు వ్యతిరేకముగ ఇద్దఱు బ్రాహ్మణ బ్రహ్మచారు లీయనయొద్ద అభియోగమును దెచ్చిరి. ఈ విచారణయందు దాదాజీకొండదేవుఁడు తుకారామును స్వపక్షమును సమర్థింపుకొనుమని నుడివెను. తుకారాముఁడు భక్తిరసామృతమును గురియు అభంగములద్వారమునఁ దనపక్షమును సమర్థించుకొనుటం జూచి బ్రహ్మచారుల హృదయము మారిపోయెను. అప్పుడు దాదాజీ కొండదేవుఁడు తుకారాముని సన్మానించి నింద్యు లగు బ్రహ్మచారులకు శిక్ష విధించెను. కాని తుకారాముని యనురోధమువలన దాదాజీ కొండదేవుఁడు బ్రహ్మచారులను వదలివేసెను.

అని శివాజీకి చెప్పుచుండెడివాఁడు. ఆనుడువులను శివాజీ కలయందైనను మఱువక సాధుసజ్జనసాంగత్యము చేయుచు, వారియుపదేశములను శిరసావహింపుచుండెను. భక్తశిఖామణియగు తుకారాముని కీర్తిని వినినకొలఁదిని, శివాజీ కాయన దర్శనవాంఛ మిక్కుటమగుచుండెను. కావున నొకనాఁడు తుకారాముఁడు లోహగ్రామమునకు వచ్చియుండెనను వార్త విని, చత్రచామర గజాశ్వములతోఁడ నాతనిఁదోడ్కొని వచ్చుటకు తన ముఖ్యోద్యోగి నొక్కనిబంపెను. ధర్మానురాగియు స్వజాతివత్సలుఁడును నగు శివాజీని గూర్చి తుకారాముఁడు కర్ణాకర్ణిగ వినుచుండెనేగాని, చూచుట తటస్థింపదయ్యె. కాని యీయన బహుజనాకీర్ణమును, మహదైశ్వర్యవంతమునగు శివాజీ మహారాజుసభ కేఁగుట కిచ్చగింపఁడాయె. "చంద్రకిరణములకు చకోరములపగిది మీదర్శనమునకు శివాజీమహారాజు నిరీక్షింపుచున్నాఁడు. దర్శనమిచ్చి తనను తనపరివారమును ధన్యులుగ నొనర్పవలయునని గోరుచున్నాఁడు" అను శివాజీ ముఖ్యోద్యోగియొక్క వాక్యములవిని తుకారాముఁడు విషమసంధియందుఁ దగుల్కొనెను. ఒక నైపున ధర్మానురాగియగు రాజపుత్రుని యాహ్వానము రాజ

సభ కేఁగవలయునని హృదయము నాకర్షించుచుండెను. రెండవవైపున రాజసభ కేఁగినచో ఉపాయనములను స్వీకరింపవలసి వచ్చునేమోయను భీతి నిరుత్సాహ పఱచుచుండెను.

అందువలన నీసందర్భమునం దీయభిప్రాయము గల అభంగములను మూలమునఁ దనమానసికావస్థను వితోబాదేవునకు నివేదించుకొనియెను. "ప్రభో! ఇటువంటి వానినెప్పుడు నినుఁగోరనుగదా! నాథా! నన్నేల కష్టములయందుఁ బడవైచెదవు? ఎల్లప్పుడు సంసారమునకు దూరమందుండుటకే గోరుచుందును. మానవుల సాంగత్యము చేయవలయునను, ఆసయే దూరమగుచున్నది. విజనవిపినమధ్యమునం దానందముతో సంచరించుచుండుటయే నాకుసంతోషదాయకము. ఓనాథా! ఛత్ర చామరములును, గజాశ్వములును, దివిటీలును, పుణ్యపథగమనమునకు సహకారులు కావు. ఓపండరిపురి నాథా! నాకిటువంటి బంధనములేల తగిలింపుచున్నావు? ఐశ్వర్యమును, సన్మానమును, దంభమును, సూకర పురీష సమముగ జూచుచుందును. కావున నన్నీ విపత్తునుండి యుద్ధరింపుము." ఇట్లు తనమానసికావస్థను వితోబాదేవునకు నివేదించుకొని స్థిరచిత్తుఁడై

శివాజీ యొక్క ధర్మాభిలాషను గొనియాడుచు, ధర్మము నందాసక్తినిఁ బురికొల్పుచు, రాజుయొక్క కర్తవ్యములను బేర్కొనుచు, నాల్గుఅభంగములను రచించి యాయుద్యోగస్థునిచేతికిచ్చి శివాజీకడకంపెను. తుకారాముఁడు పంపించిన అభంగములను చదువుకొని శివాజీమహారాజు పరమానందభరితుఁడై, ఆయనను సందర్శించుటకు లోహాగ్రామమునకువచ్చి, తుకారాముని కడ కేఁగి, సాష్టాంగదండ ప్రణామంబొనర్చి, పుష్పహారమును కంఠమునందువైచిస్వర్ణముద్రల కలశమును పాదలములకడనిడి గ్రహింపుఁడని వేడుకొనఁజొచ్చెను. కాని తుకారాముఁడా బంగారు నాణెములపాత్ర వంకనైనను జూడక యిట్లనియె "రాజపుత్రా! హరి పదపద్మము లాశ్రయించి మనువారల దృష్టికి అణు పరిమాణములగు పిపీలికములును, రాజాధిరాజులును, సమానులు. నా కుపాయనముగ నొసంగిన, యీ సువర్ణముద్రలకును, మృత్తికకును పార్థక్యము లేదు. హరిభక్తులు హరిపదములాశ్రయించి, ఆశా మోహాములకు లొంగకుండుటను నేర్చుకొని యున్నారు. కావున హరిభక్తులకు సర్వస్వమును వితోబాదేవుఁడే యగుటవలన నాతని యనుగ్రహామువలన

వారలు త్రిభువనైశ్వర్యముల కధికారులైయున్నారు. ఆయన భక్తులకు తల్లియుఁ దండ్రియునై బలమొసంగు చుండును. అందువలన వార లసమాన బలవంతులనుట నిక్కువము. సమగ్రవైకుంఠము భక్తులగృహమై యున్నది. విఠోబా యనుగ్రహమువలన భక్తులప్రభుత్వము సర్వత్ర స్థాపింపఁబడియున్నది. ధనము, ప్రతాపము, వీర్యముకలవానికి రాజపదముప్రాప్తించును. విఠోబా దేవుని యనుగ్రహమువలన భక్తులీమూఁడు లక్షణ ములు కలిగి రాజాధిరాజులకంటె శ్రేష్ఠులైయున్నారు. కావున భక్తులను బరితృప్తిపఱుప వలయు నను ఇచ్ఛ నీ కున్న యెడల, హరినామస్మరణఁజేయుచు, తులసిమాలల ధరించి, ఏకాదశీవ్రతము నాచరింపుచు, హరిదాసుఁ డవు గమ్ము. అప్పుడు భక్తులు తృప్తినొందుదురు."

మహారాష్ట్ర సామ్రాజ్య స్థాపకుఁడగు శివాజీ మహారాజు వంగి చేతులుజోడించుకొని స్వర్ణముద్రల కలశమును గైకొనుఁడని తుకారాముని ప్రార్థించు నప్పుడు తుకారాముఁ డాకలశమును క్రీగంటనైనఁ జూడక, మహాభక్తులకుఁగల సర్వభూత సమదర్శిత్వ మును బోధించి, హరిపదము లాశ్రయించి మను మను దృశ్యము, కవివరేణ్యుని లేఖినివలనను, చిత్రకారుని కుంచెచేతను; అమరత్వమునొందుట కర్హముగదా !

తుకారాముని యుపదేశ శ్రవణమువలన, శివాజీ మారుపలుకక, యాయన కుపాయన మర్పింపఁ దలఁచి తీసికొని వచ్చిన ధనకనకవస్తువాహనము లన్నిటిని బ్రాహ్మణులకొసంగి, సంకీర్తన వినుటకు మఱియొకదిన మా గ్రామమందుండెను. ప్రతిరాత్రియు శిష్యవర్గ ముతోఁ గూడి తుకారాముఁడు సంకీర్తనఁ జేయుచుండెడి వాఁడు. సంకీర్తనా సమయమున భక్తవరుల ముఖవిని స్సృతఝుంకారములు విశ్వవీణను మీటుచుండును. ఆ యనిర్వాచ్యమృదుమధుర ప్రేమానినాదము శ్రోతల మంత్రముగ్ధులుగ నొనర్చి యానందసాగరమున కాక గ్షింపుచుండును. ఆయానంద సాగరమం దోలలాడు టయేగదా, మానవజన్మముయొక్క సాఫల్యము!

సంకీర్తనా సమయమునం దుచ్చైస్స్వరమున "హరీ హరీ" యని ప్రాణనాథునిబిలచు తుకారాముని జూచి, శివాజీ విస్మితుఁ డయ్యెను. సమ్ముఖమందున్న రాకుమారుని, పిపీలికముతోఁ బోల్చుట కణుమాత్ర మైనను జంకని తుకారాముని మానసిక వికాసమును జూచి శివాజి హృదయము మాఱిపోయి, అక్షౌహిణీ సైన్య పరివృతుఁడగు రారాజు పదమునకంటె, మహా భక్తుఁడగు తుకారాముని వైరాగ్యపద ముత్కృష్టమైన

దని నిశ్చయించుకొని, నిర్జన స్థానమున కేఁగి భక్తిసాధనయందు శేషజీవితమును గడుపవలయునని సంకల్పించుకొనెను. సంకీర్తన ముగియఁగనే శివాజీ మంగళహారతిని దర్శించి, తుకారామునకు నమస్కరించి, ఛత్రచామరములు మొదలగు రాజోచిత చిహ్నములను పరిత్యజించి, ఏనెపమున నెవ్వరును దన్ను సమీపింపఁ గూడదని యుద్యోగస్థుల కాజ్ఞనొసంగి, లోహగ్రామ సమీపమందున్న నిర్జనారణ్యమున కేఁగెను. ఇట్లు పవలెల్లను నిర్జనప్రకృతి సహవాసమునఁ గాలము గడుపుచు, రాత్రులు సంకీర్తనా సమయమునకు లోహగ్రామమునకు వచ్చి సంకీర్తనను వినుచుండెను ఈవిధముగ కొన్ని దినములు గడచునప్పటికి, శివాజీ యుద్యోగస్థులు భయఁపడి యీయన ప్రవర్తనను రాజమాతకుఁ దెలియఁబఱచిరి.

పిడుగువంటి యీవార్తను విని నంతటనే జిజీబాయి శోకాకులచిత్తయై లోహగ్రామమునకు వచ్చి శివాజీ విరాగమునకు, తుకారాముని యుపదేశములే కారణమని గ్రహించి, ఆయనను శరణుఁ జొచ్చి, "ఓ భక్తవరా! నాపుత్రుఁడొక్కఁడు. సన్న్యాస మవలంబించిన నేనెటులు సహించి మనఁగలను? మావంశము

నెవరుద్ధరింతురు? ఈ రాజ్యమును రక్షించువారెవ్వరు? ఓసాధుపుంగవా! ఈవృద్ధురాలియం దనుగ్రహముంచి పుత్రభిక్ష పెట్టుము" అని నుడువుచు పాదముల పైఁబడి కన్నీరు కాల్వలై పార నేడ్చుచున్న, రాజమాతను లేవదీసి కూర్చుండఁ బెట్టి యభయ మిచ్చి శాంత వచనముల తుకారాముఁడిట్లనియె "మాతా! శివాజీ సంకీర్తనా సమయమున కిక్కడకు వచ్చును. అప్పుడు నేను సదుపదేశములొనర్చి యాతనిని సంసారము నందుఁ బ్రవేశపెట్టెదను. కాఁబట్టి మీరు విఠోబాదేవునినమ్మి హరినామస్మరణఁ జేయుచుండుఁడు." ఆమాట లాలించి రాజమాత విఠోబా నామమును స్మరింపుచు, దుఃఖమును వీడి, పుత్రునికొఱ కెదురుచూచుచుండెను. ఆ రాత్రి సంకీర్తనా స్థలమునకు శివాజి వచ్చెను. తుకారాముఁడు శివాజీని జూచి యిట్లుచెప్పందొడంగెను. "సంసార సముద్రము దాటుటకు సత్కర్మయేనావ. స్వధర్మ పరిపాలనముకంటె పరిత్రాణకు వేఱు మార్గము లేదని శాస్త్రము లుద్ఘోషింపుచున్నవి" అని నుడివి, ప్రథమమున బ్రాహ్మణధర్మములను భోధించి, తదుపరి క్షత్రియధర్మములను భోధించుట కుపక్రమించి యిట్లనియె. "సమ్ముఖమందున్న యుద్ధమున శత్రువులను

జయించుటయు, ప్రజాపాలనమును, క్షత్రియుల ధర్మములు. సుఖాభిలాషియగు వ్యక్తి నిజావయవపుష్టిని జూచికొని తృప్తి నొందు విధముననే, రాజులు సముదాయ ప్రజాసౌఖ్యమునుజూచి యానందము నొందుచుండవలయును. సదసద్వివేకములతోఁ గూడుకొని, ప్రజాపాలన మొనర్చుటకంటె క్షత్రియులకు మహత్తర ధర్మ మింకొకటి లేదు. క్షత్రియులు సత్యనిష్ఠ గలిగి, ప్రజాసుఖమే తమ సుఖముగ భావించి, సర్వభూత దయఁ గలిగి, సర్వకాల సర్వావస్థలయందు హరినామ స్మరణఁ జేయుచు, భగవత్కరుణకుఁ బాత్రులై మనవలయును. కావున నిట్టివారి విషయమునం దరణ్యావాసము ప్రయోజనకారి కాదు. కనుక వీరికి భగవానుఁడు స్వయముగ వచ్చి దర్శన మిచ్చును". ఈవిధమగు బుద్ధిప్రాభవమున శివాజీ పట్టుబడక తప్పించుకొనెను. ఇందువలన శివాజీ మహారాజుయొక్క ధర్మాసక్తియు, భగవద్భక్తియు, తుకారాముని సంకీర్తనాశక్తియు వెల్లడి కాఁగలవు.

ఎనిమిదవ ప్రకరణము

చిరకాలమునుండి, భారతవర్షమునందు తీర్థయాత్రాస్థానములు ధర్మమహాసభలై యున్నవి. ఈసభలయందు భారతవర్షీయవిభిన్న ధర్మసాంప్రదాయిలు తమ ధర్మమార్గములలోని నూతనావిష్కార తత్త్వములను బ్రదర్శింపుచుండిరి. ఈధర్మ ప్రదర్శనములు భారతీయుల ధారావాహిక సార్వజనిక దృష్టిని, అపరిచ్ఛిన్నమునుండి పరిచ్ఛిన్నమునకును, పరిచ్ఛిన్నమునుండి యపరిచ్ఛిన్నమునకును జూపుచు భారతీయుల జాతీయధర్మభావములయొక్క క్రమోన్నతిని దెలుపుచుండును. కొందఱు మహాపురుషు లీధర్మవిప్లవములను, భూతభవిష్యద్వర్తమానకాలములయందు సమన్వయించి సమన్వయ సిద్ధాంతములను వెలిబుచ్చుచుండిరి. మఱికొందఱు పరిచ్ఛిన్నముతోఁ గూడిన తమసాంప్రదాయిక ధర్మభావమునందే అపరిచ్ఛిన్నమును జూపుచుండిరి. ఇట్లేధర్మసాంప్రదాయికులు, పరస్పరసాహాయ్యమువలన నూతన వికాసమును బొందుచు, జాతీయతాధర్మశక్తిని విజృం

భింపఁ జేయుచుండిరి. ఇట్టిపుణ్యక్షేత్రములలో నేటికిని పవిత్రతమముగ పరిగణింపఁబడుచు, హిందువుల యొక్క క్రమోన్నతిని దెలుపుచు భారతజాతీయధర్మభావమునకు కేంద్రస్థానమనఁ జెల్లునది వారాణసిపురము. వైష్ణవులు శైవులు మొదలగువారలకు వేఱ్వేఱు పుణ్యక్షేత్రములుకూడఁ గలవు. అట్టివానిలో పండరిపురము మహారాష్ట్ర దేశీయ వైష్ణవులకు పరమపవిత్రస్థలము.

పండరిపురనాథుని యుత్సవమునకు వేలకొలఁది భక్తులు సమావేశమగుచుండిరి. ఒకానొక సమావేశమునందు ప్రఖ్యాతికెక్కిన జ్ఞానియు, భక్తుఁడును, శివాజీమహారాజునకు దీక్షాగురువును అగు రామదాసస్వామియు, తుకారామును బరస్పర దర్శనమువలన ధన్యులైరి. ఈయుత్సవమునందు సమావేశమైన భక్తులెవరి పంథానుసారముగ వారు సంకీర్తనను జేయుట కుపక్రమించిరి. తుకారాముఁడు తనయభ్యాసానుసారముగ భక్తులతోఁగలసి సంకీర్తనఁజేయుచు హరికథలు చెప్పుచుండెను. ఒకదినమున భక్తులందఱు తుకారాముని సంకీర్తనమునందు జేరి పరమప్రీతినొంది మఱుసటిదిన సంకీర్తనాభారమును రామదాసస్వామిపై నిడిరి. ఆదినమున భక్తులయాజ్ఞ ప్రకారము రామదాసస్వామి

ప్రాముఖ్యతను వహించి సంకీర్తనను నడపెను. ఇట్లు భక్తులందఱును గలసి కొన్నిదినములు సంకీర్తనఁజేయుచుండ శ్రీకృష్ణాష్టమివచ్చెను. ఈదినమున భక్తుల యాహ్లాదమునకు మేరలేదయ్యె.

భక్తులందఱు, ఉషఃకాలముననే స్నానమాడి, తిలకములఁదీర్చి, తులసిమాలల ధరించి, పరస్పర గాఢాలింగనము లొనర్చుకొనుచు, పెద్దలకు వందనములర్పించుచు, "హరేకృష్ణా" అని హరినామస్మరణఁజేయునప్పుడు, వేలకొలఁది స్త్రీపురుషులతోఁగూడిన యుత్సవరంగమంతయు, కృష్ణనామమునఁ బ్రతిధ్వనింపుచుండెను. పాదముల గజ్జెలుకట్టుకొని తంబురమీటుచు., జిటికెల వాయించుచు, హరినామమును బాడుచు, నృత్యముజేయుచుండు, భక్తవరుల వీక్షింపఁ బ్రేక్షకుల హృదయములు తాండవమాడుచుండెను. మృదుమధురవచోగుంభనల భక్తిరసములొలుకు హరికథల నాలించిన కొలఁదిని ప్రేక్షకు లున్మత్తులై, విరామములేక హరినామము నుచ్చరింపుచుండిరి. శ్రీమన్మహాభాగవతములోని, శ్రీకృష్ణజననమును జదువునప్పుడు సందర్భానుసారముగ భక్తులకన్నీరు మున్నీరైపారఁ జూపరుల హృదయక్షేత్రములయందు, భక్తిరసము వెల్లువలై ప్రవ

హింపుచుండెను. గోపికల వేషములను ధరించి విరహగీతములఁ బాడుచు, కోలాటము వేయుచుండు భక్తవరుల గాంచిన కొలఁదిని, చూపరులానంద పరవశులై ప్రేమగీతములఁ బాడుచు, చేతులఁ దట్టుచు నాడుచుండిరి. కొందఱు బాడుచు "శ్రీకృష్ణుఁ డవతరించెను" అని కేకలిడుచు, అఱచుచు, పరుగిడుచు, త్రోవకడ్డమైన వారిని కౌఁగిలించుకొని "శ్రీకృష్ణుఁ డుదయించెను. కుశలముగ బృందావనముఁ జేరెను" అని నుడువుచు చెట్టుపుట్టలఁ గూడ నీసువార్తను జెప్పుచుండిరి. ఒకభక్తుఁడు భీకరాకారమును దాల్చి మనచిన్నికృష్ణుఁడు శకటాసురుని సంహరించెననియు, ఇంకొకఁడు మనగోపాలకృష్ణుఁడు పూతనను బరిమార్చెననియు, వేఱొకఁడు మన బాలగోపాలుఁడు ధేనుకాసురుని వధించెననియు, శ్రీకృష్ణుని విజయవార్తలను జాటునప్పు డందఱేకగ్రీవముగ ‚మనగోపాలకృష్ణుఁడు బలరామునిఁ గూడి మధురాపురమునకేఁగి రజకుని హతమొనర్చి కంసునివధించెను' అనియఱచుచు "కృష్ణా, కృష్ణా" యని భూమికంపింప నృత్యముఁ జేయుచుండిరి. తుకారాముఁడు భక్తులవంకఁ దిరిగి భీష్మద్రోణాశ్వత్థామకర్ణ శల్య దుర్యోధన భీమసేనులతోఁ బ్రకాశింపుచున్న, కురుపాండవ వాహినీమధ్యమునందు

ధవళాశ్వముల పగ్గంబులచేఁ బూని, నొగలపైనుండి గిరగిరద్రిప్పి గుఱ్ఱములనదలించు చేకోలనాపి, పాండవ మధ్యమునకు భగవద్గీతావాగమృతంబు వర్షింపఁజేసి, దివ్యదృష్టినొసంగి, విశ్వరూపమునుజూపించెనని యుచ్చైస్స్వరమున నఱచి చెప్పునప్పుడు, భక్తులెల్లరు శ్రీకృష్ణుని విశ్వరూపంబును సందర్శించి, జయజయ నినాదములు చేసిరి. ఆబాలగోపాలము ఆనందలహరింబడి మైమఱచి ప్రేమసింధువునందు సంగమింపుచుండిరి.

భక్తులెల్లరు మైమఱచి యున్మత్తులై అఱచుచు గంతులు వేయుచుఁ బరుగిడుచు, నవ్వుచు, అవ్యక్తముగ మాట్లాడుచు, భౌతిక దేహంబులమఱచి, పరమేశ్వరాయత్తచిత్తులై నారదాది దివ్యమునులఁగలసి పుణ్యతీర్థంబులందిలకింపుచు, బృందావనమార్గంబున నిర్గమింపుచుండిరి. ఇట్లు శ్రీకృష్ణుని సందర్శనార్థంబరుగుచు, నిర్మలనీరదనీలజల కల్లోలకలకలస్వనములతోడ మత్త కాశినింబోలె మందగామియగు యమునానదీతట తరుచ్ఛాయల నొంటికాలిపై బరువూని, రెండవకాలి బొటమన వ్రేలుభూమిపైనానించి, మడిమ నాడింపుచు, గంభీరనీలగగనంబుపైఁ బోవుపయోధరంబుభంగి, మోముపై ముంగురులు జీరాడ వేణుగానంబుచే మానవజాతినంత

యు నాకర్షించి ఆడించుచున్న జగన్మోహనమూర్తి యగు శ్రీకృష్ణుని చిఱునవ్వును నిబిడాంధకార బంధురం బగు నిశీథివేళ మెఱయు మెఱపువలె సందర్శించిరి. కాని వారికన్నులకరువుతీరు టెట్లు? చేఁజిక్కినమణి జారిపోయినటులు పరితపించుచుండ, ఆలమందలలోని యంభారవములను విని యులికిపడి పకపక నవ్వుచు దాదవ్వుల బృందావనమును సందర్శించి 'శ్రీకృష్ణా! శ్రీకృష్ణా' యని పిలుచుచు, ఆలమందలమధ్య నృత్యముఁ జేయుచు మురళీనాదముచే నైంద్రజాలకునివలె భక్తులెల్లరిచే నృత్యముఁ జేయించుచున్న వేణుగానలోలుని, మృదుమధుర వేణుగానస్వనము చెవులసోకినంతనే వెఱ్ఱులై పనిపాటలు మాని పసిపాపలవీడి తండోపతండములుగ పారివచ్చు గోపికాబృందమునంగలసి, బాలగోపాలుని దరిఁజేరి వేణూస్వరమున స్వరసమ్మేళనమొనర్చి, జడకోలాటము వేయుచు "ప్రాణనాథ బిరానబ్రోవవే" అని పాడుచు మధురభావమునందోలలాడి మహాభావమునందు నిమగ్నులైరి.

భక్తుల యున్మాదమునకు మేరలేదు. వారిచర్యలు భావనాతీతములు. వారి రాజ్యము మనరాజ్యము గాదు. ప్రేమరసమును చవిఁజూచిన వారలే వారి

యున్మాదమును దెలిసికొనఁగలరు; వారిచర్యల కానం దింపఁగలరుకాని వానిని నాబోంట్లయొక్క లేఖిని యెట్లు వర్ణింపఁగలుగును? అయినను ఒక్కటిమాత్రము చెప్పఁగలను. ఆదినమున భక్తులెల్లరు చెట్లు పుట్టలు, ఇండ్లు వాకిండ్లు, మనుష్యులు మృగములనుభేదమును మఱచి యేచెట్టునుజూచినను, యేపుట్టనుజూచినను, యేమృగమును జూచినను, యేమనుష్యునిఁ జూచినను, విశ్వపతినే సందర్శించిరి. నమస్కరించిరి. ప్రసంగించిరి. సేవఁజేసిరి. రారాయని నోటినిండఁబిలచి స్నేహము నెఱపిరి. ఆడుకొనిరి. ఆలింగన మొనర్చిరి. ముద్దుకొనిరి. కొంతవడి కోపతాపములఁ జూపిరి. తిరిగి గాఢాలింగన మొనర్చుకొనిరి. ప్రాణనాథుని దర్శన స్పర్శనములవలనఁ దన్మయత్వమునొందిరి. పిమ్మట భక్తులనుకరించునది మహాభావము. దానిని నేనెట్లు చెప్పఁగలను? అది యనిర్వాచ్యము. అవాగ్మానసగోచరము. కావున వ్రాయుటెట్లు? అనుభవించియే గ్రహింపవలయును.

ఈదినము రాత్రి భక్తులు భాగవతము నాడిరి. ఇందు కొందఱు కృష్ణుఁడు, బలరాముఁడు, నందుఁడు, యశోద మొదలగు వేషములను ధరించిరి. తుకారాము గోపికావేషమును ధరించి భావోన్మత్తుఁడై నృత్యాభి

నయములు చేయసాగెను. అప్పుడీయన ముఖవినిసృత యభంగములు శ్రోతలఁ దన్మయత్వము నొందింపు చుండెను. ప్రఖ్యాతికెక్కిన భక్తులందఱు బాలకుల వలె నృత్యగీతాభినయములతోడ, ప్రేమరసమును గ్రోలి, తమ తమ స్థానముల కేఁగిరి. ఎల్లరు తుకారాముని జీవన్ముక్తుఁడని తలంపసాగిరి.

రామదాసస్వామి "రామాయతీ" పంథావలంబదకుఁడగు సన్న్యాసి. ఈయన బ్రాహ్మణవంశ సంభూతుఁడును, మహా విద్వాంసుఁడును, శివాజీ మహారాజునకు దీక్షాగురువునై యుండెను. ఈయన ప్రథమావస్థయం దొకింత స్వపంథాను రాగము గలిగి శ్రీరామచంద్ర విగ్రహమునకుఁ గాక, మఱియే విగ్రహమునకును నమస్కరింపఁడయ్యె. కాని యీయన పండరిపురమున భక్తసమావేశమునందు కలసినప్పటినుండియు చిత్తపరివర్తనుఁడై పండరిపురనాథుని దర్శించి యిట్లనియె.

"మనోమోహనశ్యామసుందమూర్తియగు శ్రీరామా? చాపమును బాణములను బరిత్యజించి, యీ యిటుక పీఠముపైని శయనించినావా?" అని నుడివి నమస్కరించి పండరిపురమునుండి వెడలునప్పుడు "సమ

స్తస్థలములు పరమేశ్వరుని శక్తితోఁ బరిపూర్ణములై యున్నవి. కనుక నేనేతీర్థముల కేఁగుదును" అని నుడివెను. తుకారాముని సాంగత్యమువలననే యీయన చిత్తపరివర్తనుఁ డయ్యెనని జెప్పుటకు నిస్సంశయము గదా!

ఇంకొకపరి యేకాదశీ యుత్సవ సందర్భమున తుకారాముఁడును రామదాసస్వామియు శివాజీయుఁ గలిసికొనిరి. ఆయుత్సవమునకు వచ్చిన అనేక మంది సన్న్యాసులు వచ్చి యుండిరి. రామదాసస్వామి శిష్యురాలగు "అకాబాయి" అను సన్న్యాసిని రామదాసస్వామి విరచితమగు "దాసబోధ" అను గ్రంథమును శ్రావ్యముగఁ బాడెను.

శివాజీ మహారాజు "పార్లీగడము" అను పేరుగల, గిరిదుర్గమునందు శ్రీరామ చంద్రమూర్తి దేవళముఁ గట్టించి, ప్రాణప్రతిష్ఠోత్సవమునకు, భక్తులు, జ్ఞానులు, సంగీతపాటకులు, విద్వాంసులు, మొదలగువారి నెల్లర నాహ్వానించెను. ఉత్సవమునకు వచ్చిన వాంద్రలో రామదాసస్వామి శిష్యురాండ్రగు అకాబాయియు, వేణూబాయియు, స్వయముగ సంకీర్తనమును జేసి, భక్తి రసామృతమును ప్రవహింపఁజేసిరి. అనేకమంది సంగీత

పాటకు లోకటిగాఁగూడి సంకీర్తనను సలిపిరి. కాని భావోన్మత్తుఁడగు తుకారాముని యసదృశ సంకీర్తనము శ్రోతల మంత్రముగ్ధులుగ నొనర్చుటవలన, నొకమాసమువఱకాయన సంకీర్తనము ప్రతిదినమును జరుగుచుండెను. ఉత్సవాంతమున ఛత్రపతి శివాజీమహారాజు, బ్రాహ్మణులను, భక్తులను, సన్న్యాసులను, జ్ఞానులను, ధనకనక వస్తువాహనములతోఁడ బూజించి, తుకారాముని బూజించుటకు స్వర్ణముద్రలను సిద్ధపఱచి నాలుగుగ్రామము లర్పింపనెంచియుండెను. కాని తుకారాముఁ డీ సడిని గ్రహించి యేరికిఁ దెలియకుండ పలాయనుఁడయ్యె. ఇందువలన శివాజీ మితిలేని పరితాపమును బొంది, తన పరితాపమును రామదాస స్వామికి నివేదించుకొన యాయన యిట్లనియె. "చతుర్విధ ముక్తులనే, సామాన్యముగ జూచు తుకారాముఁడీ యైహిక సంపదల గణనఁ జేయునా?"

ఆషాఢ కార్తీక మాసములలో పండరిపురమున జరుగు యేకాదశీ యుత్సవములకు తుకారాముఁడు తప్పక నేఁగుచుండెడి వాఁడు. ఒకమారు శరీరాస్వస్థత వలన మంచమునుండి దిగఁజాలక, విఠోబా దర్శనమున కేఁగఁజాలనైతినని పరితపింపుచుండెను. ఇట్లుండ నొక

యేకాదశికి భక్తులు భజనఁ జేసికొనుచు, రాజమార్గమున పండరిపురమున కేఁగుచుండిరి. మృదంగతాళముల శబ్దముల విని, మంచము మీఁదఁ బడియున్న తుకారాముఁడు చివ్వున లేచి రాజమార్గములోనికి తూలుచు వచ్చి, భక్తులతోఁడ నిట్లనియె. "నేనేమి యపరాధ మొనర్చితిని? ఏకారణమువలన విఠోబాదేవుఁడు తన దర్శనమునుండి నన్ను వంచించెను. నాయందనుగ్రహించి కొంచెము బల మొసంగినచో పండరిపురమునకు పరుగిడుచు వచ్చి, విఠోభాదేవునిఁ గన్నులారఁగాంచి భక్తునితో గలసి నృత్యముఁ జేయుదును" అని నుడువుచు, నిరువది నాల్గభంగములు గల యుత్తరమును విఠోబాదేవునకు సమర్పింపుఁడని యిచ్చెను. వానిలో నాలుగభంగముల సారమీ క్రింద నుదాహరించుచున్నాను.

"నన్ను చూచుటకు మీకిష్టము లేనియెడల నన్నేల పుట్టించితిరి? నా లేములకొఱకు నేనెవరి ముఖము వంకఁ జూచుచుందును? నాకష్టములను విని నన్ను పరామర్శించి యాదరించు వారెవ్వరు? ఓదేవా! నీవు నన్ను పరిత్యజించినచో నేనెవరి శరణుఁ జొత్తును? నన్నెవరు దగ్గఱకుఁ బిలతురు? నాకష్టము లెవరు తెలిసికొందురు? సంకటములనుండి నన్నుద్ధరించు వారెవ్వరు?

ఓపాండురంగా! నామనోభావముల నీవే తెలిసికొనఁగలుగుదువు."

"నిన్ను చూడవలయునను కోరిక నాహృదయమును ఢల్లడిల్లఁ జేయుచున్నది. కాని యది నెరవేరనందున నేనస్థిరుడనై యున్నాను. నా మనము మంగలమునఁ బెట్టి వేచుచున్నట్లున్నది. నే నేపాపమును జేయుటవలన నాకన్నులు నీమూర్తిని జూడఁజాలకున్నవి? నా కపాల లిఖితమునుగూర్చి యేమనియెదవు? ఎందువలన నాపాదములు పండరి పురమార్గమున నడచుట లేదు? నామస్తకము నీచరణములానకుండుటకు కారణమేమి? ఎందువలన నాహస్తములు నీకు నమస్కరించి ధన్యత నొందుటలేదు? నాజిహ్వ నీకీర్తిని గానము చేసి పవిత్రత నొందుట లేదేమి? ఓప్రభో! ఎప్పుడు నీమహాద్వారమునఁ బడి సాష్టాంగదండ ప్రణామం బాచరింతును?"

"అనేక దినములనుండి నీ వాక్యములనే నమ్మియున్నాను. కాని, నాపై నుదాసీనభావమును, జూపుచున్నావేల? ఇంత కాఠిన్యమును జూపుట న్యాయమా? నన్ను మఱచితివా? ఓ గోవిందా! నీవెట్టి గురుతర కార్యమునందు మునిఁగియున్నావు? నీ సంతానము వృద్ధి యగుటవలన నన్ను త్యజించితివా?

"నేను ధనికునియింట జన్మించి నిర్ధనుఁడనైతిని. జగత్తునం దీకథతోఁబాటు నీకీర్తి వ్యాపించినది. ఇప్పుడు నన్నెవ్వరు కలియుటలేదు. నీ యాహ్వానము రాలేదు. ఇట్టి స్థితియందు నాజీవనము కేవలము తుచ్ఛముగదా! నేను నీదర్శనాభిలాషతోఁ గంఠగతప్రాణుఁడనై యున్నాను. నామనము నీచరణ సన్నిధానమునకుఁ బరుఁగిడుచున్నది. నీదర్శనోత్కంఠత నన్ను ధైర్యచ్యుతినిగనొనర్చుచున్నది. హే! పాండురంగా! ఏవిధముగ ధైర్యచిత్తుఁడ నగుదును? ఏల నావాక్యములను పెడచెవిని బెట్టుచున్నావు? ఇట్టిస్థితియం దేమిచేయుట కర్తవ్యమో దెలిసికొనఁజాలకున్నాను."

భక్తులు తుకారాముని యాజ్ఞవడసి పండరిపురమున కేఁగుమార్గమున నిర్గమింపుచుండిరి. విఠోభా దర్శనవాంఛ మిక్కుటమగుటవలన తుకారాముఁడు నిలువఁజాలక, భక్తులవెంటఁబడి నడచుట కుపక్రమించెను. గ్రామమును దాటిదాటక పూర్వమె యాయన నడువఁజాలక పడిపోయెను. భక్తులు తుకారాముని గృహమునందుం జేర్చి పండరిపురమేఁగి యాయనపంపించిన యిరువదినాలు గభంగములను విఠోభా దేవునకుఁ జదివి వినిపించిరి. తిరిగి శిష్యులవలన నుత్సవ వివరములు విని తుకారాముఁ డానందభరితుఁ డయ్యెను.

సాధారణ ప్రజలు తుకారాముని అలౌకిక భక్తి సంపన్నుఁడని యెంచి యాయన శిష్యవర్గమునఁ జేరుచుండిరి. కడు దూరదేశములనుండి గూడ, రోగములు పోవుననుదలంపున రోగార్తులును, పుత్రులు కావలయునను దలంపున పుత్రహీనులును వచ్చి, తుకారాముని శరణుజొచ్చుచుండిరి. వైరాగ్య పరిపూర్ణుఁడగు తుకారాముని అభగంములు పసువుల కాపరులు మొదలు రాజాధిరాజుల వఱకును బాడుచు ఆత్మోన్నతి నొందుచుండిరి. రేయింబవలను భేదములేక ప్రజలు గుంపులుగ వచ్చి తన్నుఁజుట్టికొని తమకష్టములను విన్నవించుకొనుచుండుటవలన విరామమునఁ గాలము గడుపనెంచియున్న తుకారామునకు మనస్సంకటము మిక్కుటమై "ఓ ప్రభో! ఆలస్యము చేయుటేల? నన్ను వైకుంఠమునకుఁ దీసికొనిపొమ్ము" అని కేకలు వైచుచుండెడివాఁడు. అనవరతవ్రతములు, ఉపవాసములు, జాగరణ మొదలగు వానివలన నీయన శరీరము క్రమక్రమముగ క్షీణింపఁజొచ్చెను. భక్తబృందము సమావేశమైనంతటనే యున్మత్తుఁడై సంకీర్తనము ప్రారంభించి నూతన అభంగములను జెప్పుటవలన మానసిక శ్రమమిక్కుటమయ్యెను. శక్తితఱిగిన కొలఁదిని తన ప్రవాసకాలము

పూర్తియైనదని గ్రహించి "నేను వైకుంఠమునకేఁగుచున్నాను." అని యపుడపుడు నుడువుచుండెడివాఁడు.

లోహా గ్రామవాసులు తుకారాముని విడచి యుండఁజాలక పలుమారు తమగ్రామమునకుఁ దీసికొని వెళ్లుచుండిరి. వీరి భక్తిశ్రద్ధల కానందమును బొందుచు, ఆహ్వానమువచ్చినంతనే, యీయన శిష్యజనపరివేష్టితుఁడై, లోహాగ్రామమున కేఁగి సంకీర్తనను జేయుచుండెను. ఈయన అభంగముల యందనేకములు లోహాగ్రామువాసులను గూర్చి చెప్పినవై యున్నవి. తుకారాముఁడు పరలోకగమనమునకుఁ బూర్వమొకమాస మీగ్రామమందే యుండి సంకీర్తనను జేయుచుండెను. అక్కాలమున మహారాష్ట్రదేశము యుద్ధములలోఁ దేలుచుండుటవలన నెచ్చటఁజూచినను దోపిడులు నరహత్యలు మొదలగు ఘోరకార్యములు నిత్యకృత్యములై యుండెననుట యతిశయోక్తిగాదు. ఈయన నివసించియున్నప్పుడు లోహాగ్రామమును మహమ్మదీయులు కొల్లఁగొట్టిరి. ఇందువలన ననేకవిధములగు కష్టనష్టములకుఁ బాల్పడి పరితాప మొందుచుండు వారినిజూచి తుకారాముఁడీ విధముగ నుడివెను. "నష్టమైనధనము కొఱకు పరితపించుట ధర్మముగాదు. కలిగిననష్టమంతయు భగ

వద్విధానము వలననే సంభవించినదని తలంపుఁడు. పోయినధనమంతయు భగవంతుని సేవకొఱకు వినియోగింపఁబడినదని తలఁచి దుఃఖమునుమానుఁడు. సుఖదుఃఖముల కంతరాత్మస్థితుఁడగు భగవానుఁడేభోక్త. శరీరమగ్నియందుఁబడి కాలునప్పు డాదుఃఖము నాతఁడే పొందుచున్నాఁడు. కావున దుఃఖము లెప్పుడు జీవునకుఁ జెందవు."

ఈఘటనను బ్రత్యక్షముగఁ జూచుటవలన తుకారాముని స్వభావసిద్ధమగు కోమలహృదయము కరగిపోయెను. శత్రుహస్తచ్యుతమగు గ్రామముయొక్క దృశ్య మతి శోచనీయముగదా ? భస్మావశేషమైన భవనములను, పాడైన సస్యక్షేత్రములను చూచునప్పుడును, తలిదండ్రుల నెడఁబాసిన బాలురయొక్కయు, భర్తలఁ గోల్పోయిన భార్యలయొక్కయు, భార్యలఁ గోల్పోయిన భర్తలయొక్కయు, నార్తనాదములు వినునప్పుడును, ఎట్టి పాషాణ హృదయములైనను బ్రద్దలగుననుట వింతగాదు. తుకారాముఁ డీహృదయ భేదకమగు దృశ్యమునుజూచి 'ఓప్రభో ! మర్త్యలోకమునందు నివసింపవలయునను ఆశ పూర్తియైనది. నన్నిఁక వైకుంఠమునకుఁ దీసికొనిపొమ్ము.' అని విఠోబా

దేవుని బ్రార్థింపఁజొచ్చెను. లోహాగ్రామములోని భక్తులలో కొందఱు తుకారాముని సాంగత్యమును విడనాడి యుండఁజాలక, ఈయనను వెంబడించి దేహూగ్రామమునకు వచ్చిరి.

ఈయన దేహూగ్రామమునకు వచ్చిన పిమ్మట శ్రీకృష్ణుని యుత్సవము ప్రారంభమయ్యెను. సాధారణముగ నీయుత్సవమునం దసహ్యములైన కార్యములు జరుగుచుండుట యాచారమైయుండెను. కాని తుకారాముని నేత్రత్వమువలనఁ బ్రేక్షకులెల్లరు నిర్మలభక్తిరసమునం దోలలాడిరి. ఉత్సవసమాప్తి దినమునం దహోరాత్రము లభంగములు తుకారాముని ముఖవినిసృతములగుచుండెను. ఈయభంగములు "కాయబ్రహ్మకరణీ" (కాయమును బ్రహ్మకర్పించుట) అను నామమునఁ బరగుచున్నవి. మంగళ హారతి సమయమునం దీయన యుచ్చైస్స్వరమున హరినామమును సంస్మరింపుచు, నృత్యమునుజేయుచు, పాటలుపాడుచు "నేను వైకుంఠమున కేఁగుచున్నాను. రాఁదలఁచినచో ద్వరితముగరమ్ము" అని శిష్యులచేత భార్యకు వర్తమానమంపి, వైకుంఠగమనోత్సుకుఁడై సంకీర్తనను జేయుచుండెను.

ఇంతకుఁ బూర్వము కొలఁది దినములనుండి తుకారాముఁ డేతీర్థమున కేఁగుచున్నను, "నేను వైకుంఠమున కేఁగుచున్నానని" చెప్పుచుండుటవలన ఇపు డీయన యేదియో నూతన తీర్థయాత్ర కేఁగుచున్నాడని తలంచి జిజీబాయి యేవిధమగు పరితాపము నొందక "గర్భిణిగనున్న నేనేవిధముగ పిల్లలను వదలి మీతో వత్తును?" అని ప్రత్యుత్తరమంపెను. ఈవార్తనందికొని పరివేష్టితులగు వారలఁజూచి తుకారాముఁ డిట్లనియె. "అన్నలారా! నేను వైకుంఠమున కేఁగుచున్నాను. ఇఁక తిరిగి మిమ్ముఁగలసి సంకీర్తనఁ జేయఁ బోను. హరినామస్మరణయే సమస్తమానవులకు శరణ్యము. పాండురంగనాథుని శరణుజొచ్చి మనుఁడు. శిష్యులారా! నేనేఁగుచున్నాను. బందుగులారా! నాకు సెలవు. స్నేహితులారా! సెలవు. నేనిప్పు డమరధామమున కేఁగుచున్నాను. నాభార్య యిచ్చటనేయున్నది. ఆపెకు గృహకార్యనిర్వాహక చతురత లేదు. మృదుమధురముగ మాట్లాడఁ జాలదు. నేననేకవిధముల నామెకు ఋణపడియున్నాను. ఇహలోకమునం దామెను మీరు గనిపెట్టియుండుఁడు." అని చెప్పుచు, సాష్టాంగ దండప్రణామంబొనర్చి, పుట్టినింట కేఁగు జవ్వనింబోలె, చిఱునవ్వులొలయ, విఠోబా

దేవునకు నమస్కరించి, సెలవుగైకొనుచున్నానని నుడువుచు సంకీర్తనజేయుచు ఉత్సవస్థలమునుండి బయలుదేఱె ౧౬౪౯ క్రీ॥ ఫాల్గున బహుళవిదియ, ఉషఃకాలమున ఇంద్రాణీ నదీతటమును జేరెను. ఏదియో దుర్ఘటయాత్ర కేఁగుచున్నాఁడని యెంచి శిష్యులీతని నివారింపఁ నెంచిరి. కాని వారి ప్రయత్నములు నిష్ఫలమయ్యె. ఇంద్రాణీనదీతటమునుఁ జేరి భక్తులతోఁగలసి యుచ్చస్వరమున విఠోబాను బిలచుచు, నృత్యముఁజేయుచు, మైమఱచియుండుతఱి, అంతిమ ప్రార్థనాసూచకముగ నొక యభంగము తుకారాముని ముఖవినిస్సృతమయ్యెను. ఆయభంగరసామృతమును బానముచేసి బాహ్యవిషయజ్ఞానశూన్యులై, భక్తులెల్లరు నృత్యముచేయుచు గీతముల బాడుచుండు సమయమున మహాభక్తుఁడును, మహారాష్ట్ర జాతీయోద్ధారకుఁడునగు తుకారాముఁ డనంత కాలసాక్షి యగు ఇంద్రాణీనదీ సలిలముల "జలసమాధి" నొనర్చి అనంతప్రేమసాగరమున విలీనుఁ డయ్యెను.

ప్రతివత్సర మిప్పటికిని దేహూగ్రామమునందీయన జ్ఞాపకార్థము ఫాల్గుణ బహుళవిదియరోజున గొప్ప యుత్సవము జరుగుచున్నది. తుకారాముఁడు గర్భిణిగ

నున్న భార్యనుజూచి "నీగర్భమునందున్న పుత్రుఁడు మహాభక్తుఁడగును. కావున వానికి నారాయణుఁ డని పేరుఁబెట్టుము" అని నుడివినటులనే తుకారాముని భవిష్యద్వాణి సఫలమయ్యెను. నారాయణుఁడు మహాభక్తిసంపన్నుఁడై యనేక యభంగముల రచియించెను. ఆబాలగోపాల మాయభంగము లిప్పటికిని, మహారాష్ట్రదేశమునందు బాడుచుందురు. తుకారాము పరలోకయాత్ర కేఁగిన యొక వత్సరమునకు శివాజీమహారాజు దేహూగ్రామమునకువచ్చి, తుకారాముని కుటుంబపోషణార్థ మొకగ్రామమును జాగీరుగనిచ్చెను. ఇప్పటికిని యాజాగీరును వారివంశస్థు లనుభవింపుచున్నారు.

తుకారాముని పరలోకగమనమునుగూర్చి మహీపతి యీవిధముగ వ్రాయుచున్నాఁడు. "ఇంద్రాణీనదీతటమునం దంతిమప్రార్థనారూపమగు అభంగము తుకారాముని ముఖవినిస్సృతమైనంతటనే దివ్యజ్యోతివలన పార్శ్వవర్తులకన్నులు మూతపడెను. కన్నులు దెఱచి చూచు నప్పటికి తుకారాము గన్పింపలేదు. స్వర్గమునుండి దేవగణమువచ్చి తుకారాముని విమానముపై నెక్కించుకొని వైకుంఠమునకుఁ దీసికొనిపోవు చుండుటను భక్తులు మాత్రమే చూడఁగలిగిరి."

ఇంకొక చరిత్రకారుఁ డీవిధముగ జరిగియుండవచ్చునని వ్రాయుచున్నాఁడు. "తుకారాముని అభంగములను వినుచు నెల్లరును బాహ్యజ్ఞానశూన్యులై యుండిరి. అప్పుడు తుకారాముఁ డింద్రాణీనదియందు దిగి 'జలసమాధి' నొందెను. జలసమాధినొందుట ఆకాలమునందు తఱుచుగ జరుగుచుండెను. వీతరాగుఁడగు తుకారామునివంటి మహాభక్తుఁడు జలసమాధి నొందినాఁడనుట యసంభవముగాదు. ఏ స్థానమున తుకారాముఁడంతర్ధానమయ్యెనని జనులిప్పటికినిఁ జెప్పుకొనుచుందురో, ఆస్థానమతి గభీరమును, మొసళ్లు మొదలగు, జలచరములకాకరమునై యున్నది. కావున జలముల యొక్క గభీరతవలనఁగాని, జలచరములు భక్షించుటవలనఁగాని, తుకారాముని శరీరము కనుపడకుండవచ్చును. ఇందువలన తుకారాముఁడు సశరీరముతోడ స్వర్గమున కేఁగినాఁడను ప్రవాదము పుట్టియుండును."

ఈయన వ్రాసిన వ్రాతలు విశ్వాసపాత్రములుగనున్నవి. తుకారాముని వంశీకులిప్పటికిని యాయన యభంగముల వ్రాతప్రతిని బూజింపుచున్నారు. ఈ గ్రంథము చివర "౧౫౭౧-వ శకముఫాల్గున బహుళ విదియ ప్రాతఃకాలమున తుకారాముఁడు వైకుంఠమున

కేఁగెను." అని వ్రాయఁబడియున్నది. కావున నేవిధమగు యలౌకిక ఘటనలు లేని యీ వాక్యములే విశ్వసింపఁదగియున్నవి.

ఉపసంహారము

తుకారాముని జీవిత మనేక ఘటనలతోఁగూడి, కౌతూహలజనకమును, శిక్షాప్రదమునై యున్నది. సుఖదుఃఖములవలన మనుష్యున కెట్టిశిక్ష సమకూరునో, అట్టిశిక్ష తుకారాముని జీవితమునందు సంపూర్ణాకారమును దాల్చెను. ఈయన సంపన్న గృహస్థునింట జన్మించి తలిదండ్రుల పరమాదరమునకుఁ బాత్రుఁడై, సామాజికరీతి ననుసరించి, తరుణవయస్సుననే సంసారమునందు దిగి, కులపరంపరాగతమగు వ్యాపారమునం దడుగిడిన కొద్దిదినములకే, ధనార్జనానిపుణుఁడై సరివారిలోఁ బ్రశంసింపఁబడుచు తలిదండ్రుల వాత్సల్యమును భార్యయొక్క ప్రేమయు నవజాతపుత్రునియందుండు మోహమును ధనకాంక్షయు మొదలగు వానియందుఁ దగుల్కొనెను. కాని రాజకుమారుఁడగు సర్వార్థసిద్ధుని నే మహాశక్తి బిచ్చగానిగ నొనర్చెనో, ఆమహాశక్తివలన తుకారాముఁడాకర్షింపఁబడెను. పృథివియందలిదుఃఖము హింస మొదలగువానితోఁ బోరాడి, ప్రేమరాజ్యమును

స్థాపించుటకీయనను, పరమేశ్వరుఁడు తనసైన్యాధిపతిగ నియమించుకొనెనాయని తోఁచుచున్నది. విశ్వరాజ్యమునందు మ్రోగుచున్న రణనినాదమీతని రణరంగమున కాకర్షించెను. రణరంగమువైపు పరుగిడినకొలఁదిని యీయన బంధవిముక్తుఁడుకాఁ జొచ్చెను. జ్యేష్ఠసోదరుఁడు సన్యసించుటయు, దలిదండ్రులు మరణించుటయు, వర్తకమునందు ధనమును గోల్పోవుటయే కాక దివాలా దీయుటయు, దీర్ఘవ్యాధివలన పీడింపఁబడుచున్న జ్యేష్ఠభార్య గతించుటయు, సంభవించుటవలన నీయన మితిలేని యిక్కట్టులపాలయ్యెను. ఈశ్వరవిధానమునం దొకే కార్యమునం దొకరికి సంతసమును, మఱియొకరికి దుఃఖమును, గలుగుచుండునుగదా? సాధారణముగ తుకారాముఁడు పడినకష్టములయం దెవరయినఁబడినచో, నాస్తికతనే ప్రతిఫలముగఁగైకొని యుందురని చెప్పినను జెప్పవచ్చును. దల్లిచే విడనాడఁబడిన శిశువు ధృడముగఁ దల్లినే ధారణచేయువిధమున విశ్వజననివలన విడనాడఁబడిన తుకారాముఁడు విశ్వజననినే ధారణఁజేసి చరితార్థత నొందెను.

స్వర్ణకారుఁడు బంగారును పలుపుటములయందుఁ బెట్టి శుభ్రపఱచువిధముననే, భగవానుఁడు భక్తుల

యొక్క మనోమాలిన్యమును దూరము చేయుటకు ప్రచండానల రాసితోఁ బోల్పఁదగిన కష్టములయందుఁ బడవేయుచుండును. అట్టి పరీక్షలకుఁ దాళినవారలే మహాభక్తులగుచుందురు. తుకారాముని చరిత్రను దీర్ఘాగ్నిపరీక్షయని చెప్పనొప్పు. సంసారముయొక్క అసారత్వమును గ్రహించినకాలఁదిని యీయనను వైరాగ్యమావరించుచుండెను. వైరాగ్యమావరించినకాలఁదిని, లోకులీయనను పిచ్చివాఁడనియు, మూఢుఁడనియు, నిందింపసాగిరి. కాని వీనివలన తుకారాముఁడు చలింపకుండెను. ముండ్లమండ్లతో దెబ్బలుతినుటయు, అభంగములను గోల్పోవుటయు, మొదలగు కష్టము లొకటి వెంటనొకటి సంభవింపుచుండెను. ఈ కష్టములకుఁ దోడుగ గృహమునందణుమాత్రమైనను శాంతిలేకున్నను, ఈయన చూపించుచు వచ్చిన * సహిష్ణుత

* ఒకానొకప్పుడు పిల్లలకు దీసికొనివచ్చిన చెఱకుగడలను తుకారాముఁడు బీదబాలురకు పంచిపెట్టుచుండుటను జూచి, జిజీబాయి చెఱకుగడ రెండుతుండెము లగునటుల నీయన వీపుమీఁద గొట్టినదనియు వీతక్రోధుఁడగు తుకారాముఁడు భార్యవంకఁ దిరిగి "మనయిరువురకొఱకు నిత్తుదండమును రెండుచేసినావా" యని చెప్పెనని మహీపతి వ్రాయుచున్నాఁడు. ఈకథ సత్యమే యయినచో తుకారాముని సహిష్ణుత వర్ణనాతీతముగదా!

యద్వితీయము. తుకారామునికీర్తి వ్యాపించినకాలఁదిని ఈయన దర్శనార్థము ప్రజలు గుంపులుగుంపులుగ రాసాగిరి. మహారాష్ట్రదేశాధీశ్వరుఁడగు ఛత్రపతి శివాజీ మహారాజు మొదలు, కడుబీదస్త్రీలవఱకును తుకారాముని దర్శించుటకువచ్చి, కానుకగ ధనరాసులను గుమ్మరింపుచుండిరి. కాని తుకారాముఁడు వీరిచ్చు ధనమును విషతుల్యముగఁదలఁచి పరిత్యజింపుచుండెను. ఈ సందర్భమునందీయన వీతరాగమునుగూర్చి వేనోళ్ళఁ బొగడినను దీరదుగదా? ఈయన జీవితమునందు ప్రకాశించిన సహిష్ణుతయు, స్వార్థత్యాగమును, అహేతుకభక్తియు, జీవదయాపరత్వము మొదలగు సద్గుణములు మనుష్యమాత్రులకెల్లరకు ననుకరణీయంబులనుటకు సందియంబులేదు.

బాహ్యధర్మములు దేశకాలపాత్రముల ననుకరించి మారుచుండవచ్చును. కాని యాంతరంగిక ధర్మములు మాఱుచుండవు. ప్రపంచమునందుండు వివిధ మతములయందును, సాధుపురుషుల యందును, ఆంతరంగిక ధర్మములయొక్క యేకత్వము గాన్పించును. తుకారాముని యాత్మోన్నతిని జూచి, యేదేశపు సాధుపుంగవులు సంతసింపరు? ఈయన స్వభావసిద్ధముగను, మృదుమ

ధురముగను గవిత్వము జెప్పఁగలిగి యుండెను. భావమయమగు నీ కవిత్వము సాత్వికభక్తి రసాస్వాదకమై యున్నది. మహారాష్ట్ర జాతీయతయందు నిద్రాణంబయిన భక్తితత్త్వమును, ఈతఁడు మృదుమధుర కవిత్వముతోడ నుద్బోధింపఁజేసెను. "ప్రేమతోఁగూడినభక్తియే యీశ్వరునిఁ బొందుటకు ముఖ్యసాధనము" అని తుకారాముఁడు చెప్పియున్నాఁడు. విశుద్ధచిత్తమున భగవంతుని పాదములపై నిర్భరపడి మనస్సును విషయవాసనలనుండి నివృత్తినొందించి, 'హరినామస్మరణను జేయుచుండుటయే ముక్తికి శ్రేష్ఠతరమగు మార్గము. బహుళాడంబరములతోఁగూడిన కర్మలవలన. భక్తినశింపుచుండుటకు వగచి, సనాతనభక్తిధర్మమును బునరుద్ధరించుటకు తుకారాముఁడు ప్రయత్నించెను. ఈయన అభంగము లన్నియు, ఇహలోక సుఖముల క్షణికత్వమును, దుర్మార్గుల ప్రకృతిని, వారిదుర్బలత్వము మొదలగువానిని నిరసింపుచు, సాత్వికభక్తి ప్రబోధకములై యున్నవి. తుకారాముఁడు గృహస్థాశ్రమమందుండినను, ఘోరాటవులయం దాకలములు దిని జీవించు వీతరాగులకంటె వీతరాగుఁడై యుండెను. అహంకారము, ఈర్ష్య, దురభిమానముల నెఱుంగక, నితరులకుఁ జెప్ప

విధమున దాను బ్రవర్తింపు చుండెను. తుకారాముఁ డనేక స్థలములయందు వేదోక్తవిధుల మీఁద శ్రద్ధను జూపించుటయే గాక వర్ణాశ్రమ ధర్మములను గుఱించి బోధించి యున్నాఁడు. ఆత్మజ్ఞాన సంపన్నుఁ డగువాఁడు గూడ స్వజాతికర్మను బరిత్యజింపఁ గూడదని నుడివి యున్నను, అహేతుకభక్తిని, హరిసంకీర్తనకును, సర్వోత్కృష్టస్థాన మొసంగియుండుటయేగాక, ముక్తితత్త్వమును బోధించుటకు వైకుంఠమునుండి వచ్చియున్నానని జెప్పెను. ఈశ్వరకృప 'నొందుటకు జాతిభేదములు మొదలగునవి ఆటంకముగావనియు, వైష్ణవుఁ డే జాతివాఁడైనను మోక్షమునొందుట కర్హుఁడనియు, భావ్యోదయమగునంతవఱకు వర్ణాశ్రమ ధర్మములను పాలింపు చుండుట కర్తవ్యమనియు నుడివియున్నాఁడు.

తుకారాముఁడు స్వభావసిద్ధముగ శాంతచిత్తుఁడై యుండెను. కాని దుర్మార్గకార్యములను ఖండించుట కణుమాత్రమైనను వెనుకంజ వేసియెఱుఁగఁడు. జూదగాండ్రను, త్రాగుబోతులను, అబద్ధములు చెప్పువారిని, వ్యభిచారులను, సాధునిందకులను, కన్యావిక్రయము మొదలగు పాపకార్యములను జేయువారిని బహు తీవ్రముగ నిందించియున్నాఁడు.

ఈయన నూతనధర్మమును స్థాపింపలేదు కాని సనాతనధర్మమునకు నూతనవికాసమును గలిగించి యున్నాఁడు. ఈయన యభంగములం దీవిషయములు గన్పడుచుండును.

౧. సకలావస్థలయందును, భగవంతునియందు భక్తిఁగలిగియుండవలయును.

౨. తలిదండ్రుల మీఁద యాధారపడుచు భగవానునిపై నిర్భరపడియుండవలయును.

౩. భక్తిమార్గముననే యీశ్వరుఁడు లభ్యమగును. కాని బాహ్యానుష్ఠానములద్వారమున లభ్యముగాఁడు.

౪. సచ్చరిత్రుఁడై, సర్వభూతదయఁగలిగి, భగవంతుని హృదయపీఠమునం దధిష్ఠింపఁజేసికొనవలయును.

౫. సమస్తమానవులు భగవత్కృపకుఁ బాత్రులు. జాతినిబట్టిగాని, వంశమున్నుబట్టిగాని, భగవత్కృప కలుగనేరదు.

౬. ఈశ్వరునకును జీవులకును గల సంబంధమతిమధురము. ఆయన మనకు దూరమందు నివసించుటలేదు. వ్యాకులహృదయమున నాయనను బిలచిన యెడల సమస్తస్థలములయం దాయనను జూడఁగలము.

తుకారాముఁడు ప్రేమతోఁగూడిన భక్తుఁడు. భార్యాపుత్రులకు, మానాభిమానముల కీతని హృదయమునం దెప్పుడును ప్రేమమయునే చూచుచుండెడివాఁడు. తల్లిసమీపమందు కొమారుఁడును, భర్తసాన్నిధ్యమందు భార్యయు, మిత్రునిసమీపమందు స్నేహితుఁడును, అవ్యాజప్రేమతోడ హృదయభావములను వెల్లడించు విధముననే, తుకారాముఁడు ప్రాణనాథునకును తనకష్టసుఖములను విన్నవించుకొనుచుండెను. అభంగముల నింద్రాణీనదియందు పారవేయవలసివచ్చినప్పు డెవరితోడను మాట్లాడక విఠోబాదేవుని సమీపించి హృదయవేదనను విన్నవించుకొనెను. ఈయన విఠోబాదేవునితోడ సాక్షాద్భావమున మాట్లాడుచుండినటులు నీయన అభంగములను జదివినయెడలఁ దెలిసికొనవచ్చును. ఈయాత్మోపలబ్ధినేగదా జీవన్ముక్తియందురు. ఇందువలనే నీయన యేయవస్థయందుండినను, నిరంతరము దైవవాణిని వినుచుండెడివాఁ డనుట నిక్కవము.

మహారాష్ట్రదేశమునందును, భక్తిసాహిత్యము నుండియే, జాతీయసాహిత్య ముద్భవించినది. భక్తిసాహిత్యలేఖకులలోఁ దుకారాముఁ డగ్రగణ్యుఁడు. ఈ

యన విరచితమగు పదునొకండువేల యభంగములు ముద్రితములైయున్నవి. మహాభక్తుండగు బమ్మెరపోతనామాత్యునకువలె నీయనకును భగవత్ప్రసాదమువలన కవిత్వధారయలవడెను. ఈయన కవిత్వమునం దెట్టిప్రమాదములులేక, సుబోధకమగు లలితశైలితోడ భక్తిరసపూరితమై, సునీతి పరిపోషకమై, అలరారుచున్నది. ఈయన పదునొకండువేల యభంగములేకాక, ఈక్రిందఁ జేర్కొనఁబడిన గ్రంథములనుగూడ రచించియున్నాఁడు.

౧. భగవద్గీత పదునాఱవ అధ్యాయమునకు అనువాదము.
౨. నరసింహావతారచరిత్ర.
౩. ప్రహ్లాదచరిత్ర.
౪. వామనచరిత్ర.
౫. పరశురామచరిత్ర.
౬. శ్రీరామజన్మకథ.
౭. శ్రీరామచరిత్ర.
౮. శీతశోకము.
౯. శ్రీకృష్ణునిజన్మకథ.
౧౦. శ్రీకృష్ణునిచరిత్ర (బాల్యలీల)
౧౧. కల్క్యవతారము.

౧౨. కాలయవనవధ.
౧౩. రుక్మాంగదచరిత్ర.
౧౪. అంబరీషచరిత్ర.
౧౫. భానుదాసచరిత్ర.
౧౬. సియాళచరిత్ర.
౧౭. ద్రౌపది శ్రీకృష్ణుని స్తుతించుట.
౧౮. మయూరధ్వజచరిత్ర.
౧౯. సుదామచరిత్ర.
౨౦. దామాజీపంతుచరిత్ర.
౨౧. చోఖామేలాచరిత్ర.
౨౨. ద్రౌపదీవస్త్రాపహరణము.
౨౩. సాడంతమాలీచరిత్ర.
౨౪. హరిపాలచరిత్ర.
౨౫. శ్రీకృష్ణుని బాల్యలీలలు.

సంపూర్ణము.

భక్తియోగము

ద్వితీయ ముద్రణము

వంగభాషలో, బాబు అశ్వినీకుమారదత్తు ఎం. ఏ. బి. ఎల్. గారు రచించిన గ్రంథమున కాంధ్రీకరణము. చిన్నలు పెద్ద లను భేదము లేక యెల్లరును పఠింపఁదగినది. ౩౮౦ పుటలు.

కాలికో బైండు వెల రు. ౧-౦-౦

కాగితపుబైండు వెల రు. ౦-౧౨-౦

సీతాదేవి వనవాసము

ద్వితీయ ముద్రణము

శ్రీపండిత ఈశ్వరచంద్ర విద్యాసాగరుల బంగాళీ గ్రంథము ననుసరించి వ్రాయఁబడినది. సీతాదేవికష్ట పరంపర లెంతయు కరుణారసపూరితములు. శైలి మిక్కిలి సులభమై మనోహరముగా నున్నది.

వెల రు. ౦-౮-౦

విదుషీమణులు

నూతన గ్రంథము

వేదకాలము మొదలుకొని ధారావాహికముగ భారతవర్షమందలి విద్వాంసురాండ్ర చరిత్రలిందు వర్ణింపబడి యున్నవి. వివాహములు మొదలగు శుభకార్యములలో నిది బహుమతిగ నొసంగదగి యున్నది.

కాలికో బైండు వెల రు. ౧-౧౨-౦
స్టిఫ్ అట్ట ,, వెల రు. ౧-౮-౦

☞ పై గ్రంథము లిక్రింది విలాసమునకు వ్రాసిన బడయగలరు.

సరస్వతీ నిలయము,
మచిలీపట్టణము.

END OF
TITLE